## రక్షక భటుల రక్తదానం



పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా దర్శిలో మంగళవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. పోలీసు అధికారులు, సిబ్బంది, యువత మొత్తం 169 మంది స్వచ్ఛందంగా రక్తం దానం చేశారు. కార్యక్రమంలో దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ, సీఐ రామారావు, ఎస్సైలు మురళి, నాగరాజు, మల్లికార్జున, బ్రహ్మనాయుడు, వేమన, శివ, శివ బసవరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, దర్శి

## అయ్యంబొట్లపల్లెలో కాకతీయ శాసనం



యర్రగొండపాలెం సమీపంలోని రామచంద్రాపురం(అయ్యంబొట్లపల్లె) శివాలయం చెంత ముచలిందనాగ శిలాశాసనాన్ని చారిత్రక పరిశోధకుడు తురిమెళ్ల శ్రీనివాస ప్రసాద్ గుర్తించారు. కాకతీయుల ఏలుబడిలోని మెట్టవాడ(ప్రస్తుతం వినుకొండ, త్రిపురాంతకం, పుల్లలచెరువు, వై.పాలెం ప్రాంతాలు)లోని దువ్వలి కంపణంలో గల వెల్మపల్లి(ప్రస్తుతం త్రిపురాంతకం మండలం వెల్లంపల్లె) గ్రామాన్ని అమరావతిలోని బుద్ధ దేవునికి దానం చేసినట్లు ఇందులో లిఖించి ఉంది. రుద్రమదేవి పుణ్యం కోసం కాకతీయుల సామంతులైన బొల్నాయుని మల్లికార్జున నాయంకులు ఈ గ్రామాన్ని దానం చేసినట్లు పేర్కొన్నారు. 10వ శతాబ్దం తర్వాత కూడా బౌద్ధ మతం కొనసాగిందని చెప్పడానికి ఈ శాసనం ఆధారంగా నిలుస్తోందని పురావస్తుశాఖ డైరెక్టర్ ముని రత్నంరెడ్డి తెలిపారు.

– న్యూస్‌టుడే, యర్రగొండపాలెం

# ఏటికేడు... నీరుగార్చారు

- క్రమేపీ తగ్గుతున్న నిల్వ సామర్థ్యాలు
- పూడికతీత ఊసే లేని జలాశయాలు
- మరమ్మతులకు నోచని తూములు, కాలువలు

నదులకు నడకలు నేర్పే ఇంజినీరింగ్ మన సొంతం. నీరు వృథా కాకుండా నిలిపి ఉంచే కట్టడాలు మనకు ప్రత్యేకం. సాగు, తాగునీటి అవసరాలకు నదులు, వాగులు, వంకలపై నిర్మించిన చెరువులు, జలాశయాలు ఓ అద్భుతం. అడపాదడపా కురిసే వానలు.. ఎగువ నుంచి వచ్చి చేరే నీటితో అవి నిండుకుండలా మారితే ఆ ప్రాంతంలోని ప్రజల బతుకులకు ఎంతో భరోసా లభిస్తుంది. ఈ విషయాన్ని క్రమేపీ పాలకులు విస్మరిస్తున్నారు. జల వనరుల నిర్వహణను పట్టించుకోవడం లేదు. ఫలితంగా పూడిక పెరిగి నిల్వ సామర్థ్యం ఏటికేడు తగ్గుతోంది. వర్షాలు, వరదలొచ్చినా పూర్తిస్థాయిలో నిండటం లేదు. పైగా నెలల్లోనే ఖాళీ అవుతున్నాయి. జలాశయంలో నీళ్లు ఎందుకు తగ్గుతున్నాయి. విడుదలకు, నిల్వ సామర్థ్యానికి పొంతన ఎందుకు కుదరడం లేదు అనే దిశగా పాలకులు ఆలోచన చేయడం లేదు. ఈ నేపథ్యంలో కేంద్ర జలసంఘం తాజాగా ఓ నివేదిక విడుదల చేసింది. జిల్లాలోని జల వనరుల్లో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోతోందని హెచ్చరించింది. కంభం చెరువులో నీటి సామర్థ్యం ఇప్పటికే చాలా వరకు తగ్గిందని పేర్కొంది. ఈ నేపథ్యంలో కీలకమైన మరికొన్ని జల వనరుల పరిస్థితి.. వాటిపై దృష్టి సారించాల్సిన అవసరాన్ని చెప్పకనే చెబుతోంది.

– ఈనాడు, ఒంగోలు

### చారిత్రక చెరువుకు చెదలు...



- పేరు:: కంభం చెరువు
- ప్రాంతం: కంభం
- ఆధారం: గుండ్లకమ్మ నది జలాలు
- నిర్మాణం: 15వ శతాబ్దం
- ప్రసిద్ధి: శ్రీకృష్ణదేవరాయులు కాలంలో 23.95 కిలో మీటర్లలో నిర్మితమైంది. మానవ నిర్మితమైన చెరువుల్లో ఆసియా ఖండంలోనే అతి పెద్దదిగా పేరొందింది. పది వేల ఎకరాలకు సాగు, 2 లక్షల మంది ప్రజల తాగు నీటి అవసరాలు తీరుస్తోంది.

- నిర్మితమైనప్పటి నుంచి ఇప్పటి వరకు కేవలం పది సార్లు మాత్రమే పూర్తిగా నిండి అలుగు పారింది.
- 1956లో ఈ చెరువు నీటి నిల్వ సామర్థ్యం 3.73 టీఎంసీలు.
- 1978 నాటికి నీటి నిల్వ సామర్థ్యం 2.97 టీఎంసీలకు తగ్గింది.
- 2023 సర్వే ప్రకారం మరో 0.99 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం తగ్గినట్లు అధికారులు గుర్తించారు.
- పూడికతీత, జంగిల్ క్లియరెన్స్ చేయకపోవడం ఇందుకు కారణంగా తెలుస్తోంది. మరోవైపు తూముల లీకులతో జలాశయంలోని నీరు వృథాగా పోతోంది. ఒకప్పుడు జలాశయం నిండితే మూడు పంటల సాగుకు సరిపడా నీరు పుష్కలంగా లభించేది. ఇప్పుడు ఒక పంటకే సరిపోతున్నాయి.
- చెరువులో పూడికతీతత, జంగిల్ క్లియరెన్స్ పనులతో పాటు., తూముల నుంచి నీటి వృథాను అరికట్టాల్సి ఉంది.

### పట్టించుకోకుండా మోపాడుబెట్టారు...



- పేరు:: మోపాడు జలాశయం
- ప్రాంతం: పామూరు మండలం
- నిర్మాణం: 1902
- సామర్థ్యం: 2.09 టీఎంసీలు
- ఆయకట్టు: 13 వేల ఎకరాలు(అధికారికం), మరో మూడు వేల ఎకరాలు(అనధికారికం)
- జలాశయంలో నీళ్లు నిండుగా ఉండటం ద్వారా పరిసర గ్రామాల్లో భూగర్భ జలాలు పుష్కలంగా లభిస్తాయి.

- జలాశయాన్ని పాలకులు ఏళ్లుగా గాలికొదిలేశారు.
- రెండేళ్ల క్రితం కట్ట నుంచి నీరు లీకు కావడంతో సమీప గ్రామాల ప్రజలు ఆందోళనకు గురయ్యారు.
- జిల్లా యంత్రాంగం రాత్రి వేళలోనూ కాలువ గట్టు వద్దే మకాం వేసి గండ్లు తాత్కాలికంగా పూడ్చాల్సి వచ్చింది.
- ఇప్పటి వరకు ఒక్కసారి కూడా పూడికతీయలేదు.
- నీటినిల్వ సామర్థ్యం దాదాపు 0.5 టీఎంసీలు తగ్గింది. తూములు సరిలేక నీళ్లు వృథాగా పోతున్నాయి.

### రామా.. నిలవదేమి తీర్థం



- పేరు: రామతీర్థం జలాశయం
- ఆధారం: సాగర్ జలాలు
- ప్రాంతం: చీమకుర్తి మండలం రామతీర్థం
- ప్రారంభం: 2009
- సామర్థ్యం: 1.514 టీఎంసీలు
- ఆయకట్టు: 80 వేల ఎకరాలు
- తాగునీరు: సంతనూతలపాడు, ఒంగోలు, కనిగిరి, కందుకూరు నియోజకవర్గాల్లో దాదాపు 300 గ్రామాలకు సరఫరా

- సమస్య: జలాశయంలో ఇప్పటి వరకు ఒక్కసారి కూడా పూడికతీత చేపట్టలేదు. 2018-19లో పూడికతీతకు జల వనరుల శాఖ అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఎన్నికలు, ఇతర అంశాల నేపథ్యంలో కార్యరూపం దాల్చలేదు. దీనికితోడు జలాశయం తూములు లీకేజీల కారణంగా నిత్యం నీరుగా వృథాగా పోతోంది. దీంతో జలాశయంలో నిండుగా నీళ్లున్నా.. ఒక్కోసారి వారాల్లోనే ఖాళీ అవుతోంది. జలాశయంలో పూడికతీతతో పాటు, లీకేజీలను అరికట్టాల్సి ఉంది.

### గుండ్లకమ్మ.. నిర్లక్ష్యమే శాపమమ్మా!



- పేరు: కందుల ఓబులరెడ్డి జలాశయం
- ఆధారం: గుండ్లకమ్మ నది
- ప్రాంతం: మద్దిపాడు మండలం మల్లవరం
- నిర్మాణం: 2004లో ఆమోదం.. 2006లో పనులు మొదలై 2008లో పూర్తి.
- నిల్వ సామర్థ్యం: 3.875 టీఎంసీలు.
- ఆయకట్టు: 80 వేల ఎకరాలు
- తాగునీరు: 23 లక్షల మందికి



పూర్తిస్థాయిలో గేట్లు లేక వృథాగా పోతున్న జలం

- సమస్య: గుండ్లకమ్మ జలాశయం నిర్వహణను వైకాపా ప్రభుత్వం గత అయిదేళ్ల పాలనలో గాలి కొదిలేసింది. దీంతో రెండు గేట్లు కొట్టుకుపోయాయి. విధిలేని పరిస్థితుల్లో నీళ్లు వృథాగా వదిలేయాల్సి వచ్చింది.
- 2008 నుంచి ఇప్పటి వరకు ఒకసారి కూడా పూడికతీత, జంగిల్ క్లియరెన్స్ చేపట్టలేదు.
- ప్రస్తుతం నాలుగడుగుల వరకు పూడికతో నిండి ఉంటుందని అంచనా.

# ప్రసవాలు చేయడం లేదు రక్తం తీసుకోవడం లేదు

- మహిళా మార్ట్‌ల్లో అక్రమాలపై చర్యలు ఏవీ!
- జడ్పీ సమావేశంలో మంత్రి స్వామి ఆగ్రహం



మాట్లాడుతున్న మంత్రి బాల వీరాంజనేయ స్వామి.. చిత్రంలో విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి, జడ్పీ ఛైర్‌పర్సన్ వెంకాయమ్మ, కలెక్టర్ తమీమ్ అన్సారియా, బాపట్ల జేసీ ప్రఖర్ జైన్

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: 'జిల్లాలోని ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రసవాలు ఎందుకు చేయడం లేదు.. వసతులు లేవా? ప్రభుత్వ వైద్యశాలకు ప్రైవేట్ బ్లడ్ బ్యాంక్‌ల నిర్వాహకులు రక్తం ఇస్తున్నారా..! ఇవ్వకుంటే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు?' అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి వైద్యాధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా ప్రజా పరిషత్ సమావేశం జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అధ్యక్షతన ఒంగోలులో మంగళవారం నిర్వహించారు. డ్వామా, డీఆర్డీఏ, వ్యవసాయ, వైద్య ఆరోగ్య, గృహ నిర్మాణం, విద్యుత్తు శాఖలపై ఈ సందర్భంగా సమీక్షించారు.

**కేసులు కట్టలేదు.. దొంగ పత్రాలిచ్చారు...**

తొలుత మంత్రి స్వామి మాట్లాడుతూ.. మహిళా మార్ట్‌లో చోటుచేసుకున్న అక్రమాలపై చర్యలు తీసుకున్నారా..? అని డీఆర్డీఏ పీడీ వసుంధరను ప్రశ్నించారు. అక్రమార్కుల నుంచి రికవరీ చేసినట్లు అధికారులు సమాధానమిచ్చారు. అందుకు ఆగ్రహించిన మంత్రి.. రూ.లక్షలు కొల్లగొడితే కేసులు ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. గ్రామాల్లో సామాజిక తనిఖీల ద్వారా అనర్హులకు పింఛన్లు తొలగించనున్నాం, దివ్యాంగులకు దొంగ ధ్రువీకరణ పత్రాలు ఇచ్చిన వైద్యుల పైనా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గత ప్రభుత్వంలో శ్మశానాల్లోనూ లేఅవుట్లు వేశారని ఎద్దేవా చేశారు. మౌలిక వసతులు, మెరక పేరిట నిధులు దుర్వినియోగం చేశారని.. తక్షణమే రికవరీ చేయాలని ఆదేశించారు.

**ఎరువుల సరఫరాలో అలసత్వం వద్దు...:** విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ.. ఎరువులు సరఫరా చేయడంలో అలసత్వం వహించొద్దని వ్యవసాయాధికారులకు సూచించారు. నల్ల బజారులో ఎక్కువ ధరలకు అమ్మితే చర్యలు తీసుకోవడంతో పాటు, నిల్వలను సీజ్ చేయాలన్నారు. ఇటీవల కురిసన వర్షాలకు దెబ్బతిన్న పంటల వివరాలపై మరోసారి పరిశీలన చేయాలన్నారు. రోడ్డు ప్రమాదం చోటుచేసుకున్న 30 నిమిషాల వరకు 108 వాహనం రావడం లేదని; జాతీయ, రాష్ట్రీయ రహదారుల వెంట సరిగ్గా పనులు చేయని కారణంగా కాలనీల్లోకి నీరు ప్రవహిస్తోందన్నారు. సదరు అధికారులతో సమావేశం నిర్వహించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. సాగర్, గుండ్లకమ్మ కాలువ నిర్వహణకు నిధులు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. త్వరలోనే గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్(ఒంగోలు), బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి(దర్శి), ముక్కు ఉగ్రనరసింహారెడ్డి(కనిగిరి), ముత్తుముల అశోక్‌రెడ్డి(గిద్దలూరు), కందుల నారాయణ రెడ్డి(మార్కాపురం) తమ నియోజకవర్గాల్లోని సమస్యలను పరిష్కరించాలని కోరారు. సర్వసభ్య సమావేశంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా, బాపట్ల జేసీ ప్రఖర్ జైన్, జడ్పీ సీఈవో చిరంజీవి, ఎమ్మెల్సీలు కంచర్ల శ్రీకాంత్, పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డితో పాటు, జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు ఇంటూరి(కందుకూరు), ముత్తుముల(గిద్దలూరు), కందుల(మార్కాపురం), ఉగ్రనరసింహారెడ్డి(కనిగిరి), దామచర్ల(ఒంగోలు).. ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి, వైకాపా ఎమ్మెల్యే బూచేపల్లి(దర్శి).. జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, జిల్లా అధికారులు

# సరస్వతికి లక్ష్మీ కటాక్షం

- పాఠశాలల నిర్వహణకు నిధులు
- విడుదల చేసిన కూటమి సర్కారు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే:

మండల విద్యావనరుల కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. వైకాపా ప్రభుత్వంలో 2023లో 40 శాతం నిధులు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకొన్నారు. 2024 ఎన్నికల ఏడాదిలో ఒక్క పైసా కూడా మంజూరు కాలేదు. దీంతో ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు సొంతంగా ఖర్చుపెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రధానంగా పాఠశాలల్లో చాక్‌పీస్‌లు కొనుగోలు చేసేందుకు కూడా ఖాతాల్లో పైసల్లేక ఇబ్బందులెదుర్కొన్నారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక మంత్రి లోకేశ్ దృష్టికి ఈ సమస్యలను పలువురు తీసుకెళ్లారు. ఉపాధ్యాయ సంఘాల సమావేశంలోనూ నిధుల అంశాన్ని ప్రధానంగా ప్రస్తావించారు. స్పందించిన మంత్రి లోకేశ్ అన్ని జిల్లాలకు నిధులు విడుదల చేస్తూ మంగళవారం ఉత్తర్వులిచ్చారు.

జిల్లాలో ఎంఈవో కార్యాలయాలు: 38

ఒక్కో కార్యాలయానికి కేటాయింపు: రూ. 1.30 లక్షలు

(వీటిలో టీఎల్ఎంకు రూ.30 వేలు, నిర్వహణకు రూ.30 వేలు, కంటెజెన్సీకి రూ.40 వేలు, సమావేశాల ఖర్చులకు రూ.30 వేలు)

జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు: 2,168

కేటాయించాల్సిన మొత్తం నిధులు: 566.35 లక్షలు

(తొలి విడతగా అందులో 50 శాతం అంటే రూ. 283.175 లక్షలు విడుదల చేశారు. అదే నిష్పత్తిలో ప్రతి పాఠశాలకు 50 శాతం నిధులు జమ చేయనున్నారు. వీటిని 2024-25 విద్యాసంవత్సరంలోనే వినియోగించుకోవాల్సి ఉంటుంది.)

# నగదు బదిలీలు నిజం

- ప్రభుత్వ ఉత్తర్వులూ కాదని పోస్టులు
- డీపీవో కార్యాలయం కేంద్రంగా వసూళ్లు



వివరాలు తెలుసుకుంటున్న విచారణాధికారి లోకేశ్వరరావు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ గ్రేడ్-5, 6 కార్యదర్శుల బదిలీలకు సంబంధించి అక్రమాలు చోటుచేసుకున్నాయని.. డీపీవో కార్యాలయం కేంద్రంగా పెద్ద మొత్తంలోనే నగదు చేతులు మారినట్లు విమర్శలు వచ్చాయి. పూర్వ డీపీవో, ప్రస్తుత ఒంగోలు డీఎల్‌డీవో ఉషారాణి ఇందులో కీలకంగా వ్యవహరించారంటూ ఆరోపణలు వెల్లువెత్తాయి. స్పందించిన ఉన్నతాధికారులు ఎస్‌డీసీ లోకేశ్వరరావు ఆధ్వర్యంలో త్రిసభ్య కమిటీని నియమించారు. దీంతో రెండో రోజైన మంగళవారం కూడా విచారణ కొనసాగింది.

**చర్యలు తీసుకున్నా.. తగ్గలేదు...:** బదిలీ అయిన ఉద్యోగులు ఈ నెల మూడో తేదీ తర్వాత విధుల్లో చేరారు. జిల్లాలో మాత్రం సుమారు వంద మంది గ్రేడ్-5, 6 కార్యదర్శులకు పోస్టింగుల ఉత్తర్వులు అందలేదు. దీంతో వారంతా ఈ నెల 5వ తేదీ నుంచి కలెక్టరేట్‌లోని డీపీవో కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయడం ప్రారంభించారు. ఈ విషయమై కలెక్టర్ తమీమ్ అన్సారియా విచారణకు ఆదేశించారు. ప్రాథమిక నివేదిక ఆధారంగా డీపీవో కార్యాలయ పూర్వ ఏవో శివప్రసాద్, జూనియర్ సహాయకుడు కిషోర్, డిజిటల్ సహాయకుడు సాయి కోటేశ్వరరావులపై చర్యలు తీసుకున్నారు. అయినా డీఎల్‌డీవో ఉషారాణి తగ్గలేదు. కొందరికి పోస్టింగ్ ఉత్తర్వులు ఇచ్చే పనిని కార్యాలయానికి చెందిన మరో ఉద్యోగి సాయి సంతోష్‌కు అప్పగించారు. 40 మంది గ్రేడ్-6, మరో ఆరుగురు గ్రేడ్-5 కార్యదర్శులకు మళ్లీ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. అందుకుగాను రూ.2.30 లక్షల వరకు నగదు వసూలు చేసినట్లు ప్రాథమికంగా గుర్తించారు..

**ఒక ఉద్యోగికి మూడు పోస్టింగులు...:** గ్రేడ్-6 ఉద్యోగి ఒకరికి చీరాల మండలం ఈపురుపాలెంతో పాటు, తాళ్లూరు, ముండ్లమూరు మండలానికి చెందిన గ్రామాల్లోనూ పోస్టింగులు ఇచ్చారు. ప్రస్తుతం ఆయన తాళ్లూరు మండలం తురకపాలెం సచివాలయంలో విధులు నిర్వహిస్తున్నట్లు విచారణలో అధికారులు గుర్తించారు. అలాగే మరి కొందరికి ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకుండా ఖాళీగా ఉంచారు. సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియకు సంబంధించి కలెక్టర్ తమీమ్ అన్సారియా నుంచి అనుమతులు తీసుకున్న పేర్లు కాకుండా, ఇతరులకు పోస్టింగ్‌లు ఉత్తర్వులు ఇచ్చినట్లు త్రిసభ్య కమిటీ గుర్తించింది. అధికార పార్టీ ఎమ్మెల్యేల నుంచి వచ్చిన సిఫార్సు లేఖలను కూడా పక్కన పెట్టి నగదు ఇచ్చిన ఉద్యోగులకు పోస్టింగులు ఇచ్చినట్లు ఆధారాలు సేకరించారు. విచారణ ప్రక్రియ పూర్తి కావడంతో తదుపరి చర్యల నిమిత్తం కలెక్టర్‌కు నివేదికను బుధవారం అందజేయనున్నారు.



## ఆర్టీసీ, ప్రైవేట్ డిష్యుం డిష్యుం



పొదిలి ఆర్టీసీ డిపో ఎదుట ప్రైవేట్ బస్సులను అడ్డుకున్న ఆర్టీసీ డ్రైవర్లు

పొదిలి, న్యూస్‌టుడే: ఆర్టీసీ, ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు డ్రైవర్లు బాహాబాహీకి దిగిన సంఘటన పొదిలిలో మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. . ప్రైవేట్ బస్సు చోదకుడు ఒకరు ఆదివారం రాత్రి కురిచేడులో రోడ్డు పైనే నిలిపి ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. వెనుకగా వస్తున్న పొదిలి డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సుకు ఎంతకూ దారివ్వలేదు. ఈ విషయమై డ్రైవర్ల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అదే సమయంలో అటుగా వచ్చిన మరో నాలుగైదు ప్రైవేట్ బస్సుల డ్రైవర్లు ఆర్టీసీ డ్రైవర్‌ను బెదిరించి దుర్భాషలాడారు. ఈ విషయాన్ని బాధితుడు పొదిలి డీఎం, కార్మిక సంఘాల నాయకులకు చరవాణి ద్వారా తెలిపారు. అనంతరం హైదరాబాద్ నుంచి పొదిలి మీదుగా వెళ్తున్న ప్రైవేట్ బస్సులను డిపో ఎదుట ఆర్టీసీ డ్రైవర్లు మంగళవారం ఉదయం నిలిపేసి ఆందోళనకు దిగారు. కొందరిపై చెయ్యి చేసుకున్నారు. ఈ వివాదంపై పోలీసులకు పరస్పరం పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. దీంతో రెండు వర్గాలకు చెందినవారితో సీఐ మాట్లాడారు. ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే ఇరువురిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించి పంపారు.

## 837 సంఘాలకు రూ.100 కోట్ల రుణాలు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలోని 837 స్వయం సహాయక సంఘాల మహిళల జీవనోపాధి పెంపుదల లక్ష్యంగా రూ.100 కోట్ల మేర రుణాలు మంజూరు చేసినట్లు డీఆర్డీఏ పీడీ వసుంధర తెలిపారు. డీఆర్డీఏ, కెనరా బ్యాంక్ అధికారుల సమావేశం ఒంగోలు భాగ్యనగర్‌లోని టీటీడీసీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలన్న ఆకాంక్షతో బ్యాంక్‌లు విరివిగా రుణాలు అందిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 25న ఒంగోలులోని ఏ-1 కన్వెన్షన్ ఫంక్షన్ హాల్‌లో కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో ఈ రుణాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మహిళలకు ఆర్థికంగా చేయూత అందించి వారికి ఆసక్తి ఉన్న రంగాల్లో పీఎంఈజీపీ కింద 35 శాతం రాయితీతో పలు యూనిట్లు మంజూరు చేయనున్నట్లు వివరించారు. సమావేశంలో ఎల్‌డీఎం రమేష్, కెనరా బ్యాంక్ ఆర్‌ఎం శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

# తప్పిన పెట్రో బాధ.. విద్యుత్తుతో నిత్యం ఆదా





ఆ చిరు వ్యాపారి కొత్తగా ఆలోచించారు. పెట్రో బాదుడును తాళలేక విద్యుత్తు ఆటో కొనుగోలు చేశారు. ఎండైనా..వానైనా ఇబ్బంది లేకుండా ట్రాలీ ముందు భాగంలో పైన పట్టా ఏర్పాటు చేశారు. వెనుక కూరగాయలు ఉంచి విక్రయాలు చేస్తున్నారు. సింగరాయకొండ మండలం పాకలలో ఈ కొత్త వాహనాన్ని స్థానికులు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

–ఈనాడు, ఒంగోలు

# అవినీతిలో మునిగింది...

బొమ్మలు





అయిదేళ్ల వైకాపా పాలనలో ఆర్టీసీ కుదేలైంది. సింగరాయకొండ ఆర్టీసీ బస్టాండ్ అభివృద్ధి కోసం నాడు రూ.80 లక్షలు మంజూరు చేయగా, కనీసం ఆక్రమణలు కూడా తొలగించలేదు. దీంతో నీరెళ్లే దారిలేక డిపో అంతా జలమయమవుతోంది. అప్పుడు నిధులన్నీ వైకాపా నాయకుల జేబుల్లోకే వెళ్లాయని ప్రయాణికులు వాపోతున్నారు. –సింగరాయకొండ గ్రామీణం

## మానవత్వం చూపిన మంత్రి గొట్టిపాటి

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: రక్తపు మడుగులో రహదారిపై పడిఉన్న క్షతగాత్రుడిని చూసి రాష్ట్ర విద్యుత్తు శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ చలించారు. తన కాన్వాయ్‌ను ఆపి మానవత్వం చాటారు. ఈ ఘటన జాతీయ రహదారిపై ఒంగోలు సమీపంలోని త్రోవగుంట పైవంతెన వద్ద మంగళవారం చోటుచేసుకుంది. జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో పాల్గొనేందుకు మంత్రి తన నివాసమైన చిలకలూరిపేట నుంచి ఒంగోలు వస్తున్నారు. మార్గమధ్యంలో త్రోవగుంట వద్ద ఓ వ్యక్తి రక్తపు మడుగులో రహదారిపై పడి ఉండటాన్ని చూశారు. అతను బాపట్ల జిల్లా బల్లికురవ మండలం అంబడిపూడికి చెందిన సుభానీగా గుర్తించారు. ఒంగోలుకు ద్విచక్ర వాహనంపై వస్తుండగా వెనుక నుంచి దూసుకొచ్చిన కారు అతన్ని ఢీకొట్టి ఆగకుండా వెళ్లిందని తెలుసుకున్నారు. దీంతో మంత్రి గొట్టిపాటి వెంటనే ఒంగోలులోని కిమ్స్ వైద్యశాలకు సమాచారం అందించారు. అంబులెన్సులో అతన్ని వైద్యశాలకు దగ్గరుండి తరలించారు. క్షతగాత్రుడికి మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను ఆదేశించారు.



రహదారిపై క్షతగాత్రుడిని పరిశీలిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

## జగన్ అరాచకాలతో వ్యవస్థలు నాశనం

ఈనాడు–ఒంగోలు–ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: గతంలో జగన్ చేసిన అరాచకాల వల్లే వ్యవస్థలన్నీ సర్వనాశనమయ్యాయని రాష్ట్ర విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ విమర్శించారు. స్థానిక జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. శాంతిభద్రతలు అదుపులోనే ఉన్నాయని వినుకొండలో కొట్టుకున్న ఇద్దరు యువకులు వైకాపా వారేనని, దీంతో తమకు సంబంధం ఏమిటని ప్రశ్నించారు. ముంబయి సినీ నటిని వేధింపులకు గురిచేశారన్నారు. పెద్ద ఎత్తున విద్యుదుత్పత్తి, ఉద్యోగావకాశాల కల్పన తమ ప్రభుత్వ ప్రాధాన్యాలన్నారు. వైకాపా ప్రభుత్వం మోపిన విద్యుత్తు భారాన్ని నేటికీ ప్రజలు మోయాల్సి వస్తోందని విమర్శించారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చాక రాష్ట్రాన్ని గాడిలో పెట్టి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

## వైద్యశాల పర్యవేక్షకుడిపై విచారణ



విచారణకు వచ్చిన గుంటూరు డీసీహెచ్ఎస్ మజీదాబీ

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే : గిద్దలూరు వైద్యవిధాన పరిషత్ ఆసుపత్రి గత పర్యవేక్షకుడు డా.సూరిబాబుపై అభియోగాలొచ్చిన నేపథ్యంలో మంగళవారం గుంటూరు డీసీహెచ్ఎస్ మజీదాబీ విచారణ చేపట్టారు. వైద్యశాల పర్యవేక్షకుడు డా.సూరిబాబు మత్తు వైద్యుడైనా గర్భిణులకు శస్త్రచికిత్సలు చేశారని, అవినీతికి పాల్పడ్డారని రాచర్ల మండలం అనుమలవీడుకు చెందిన యామా సంజీవ్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గుంటూరు డీసీహెచ్ఎస్ మజీదాబీ మంగళవారం వైద్యాధికారులు, సిబ్బందిని విచారించారు. తన నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు ఆమె చెప్పారు. వైద్యశాల ఇన్‌ఛార్జి పర్యవేక్షకుడు డా.ఆదాం, వైద్యాధికారులను ఆమె ఆరా తీశారు.

# నేతల స్వార్థంతో సంతలకు ఎసరు

- ఎస్ఎన్‌పాడుకు వైకాపా దెబ్బ
- తాజాగా తరలిన సింగరాయకొండ మార్కెట్
- పశువుల కోసం పక్క జిల్లాలకు పరుగులు



సంతనూతలపాడులోని మద్దిపాడు మార్కెట్ యార్డులో నిరుపయోగంగా పశువుల సంత

జిల్లా రైతులకు కొండంత అండగా ఉండే పశువుల సంతలు ఒక్కొక్కటీగా తరలిపోతున్నాయి. దీంతో భారీగా చేతి చమురు వదిలించుకుని పక్క జిల్లాలకు వారు పరుగులు పెట్టాల్సిన దుస్థితి నెలకొంటోంది. గతంలో ఓ వెలుగు వెలిగిన సంతనూతలపాడు ప్రభుత్వ సంత నాటి వైకాపా నాయకుడి కుట్రతో తరలిపోయింది. తాజాగా సింగరాయకొండలోని ప్రైవేటు సంత కూడా నెల్లూరు జిల్లాకు వెళ్లిపోవడం పశుపోషకులకు శరాఘాతమైంది.

న్యూస్‌టుడే, సంతనూతలపాడు :



పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్న పశువుల గోదాం

జిల్లాలో సంతనూతలపాడులో ప్రభుత్వ, సింగరాయకొండలో ప్రైవేటు సంతలుండేవి. వీటివల్ల పశుపోషకులకు బహుళ ప్రయోజనాలు చేకూరేవి. సంతనూతలపాడులోని మద్దిపాడు వ్యవసాయ మార్కెట్‌లో గేదెల క్రయ విక్రయాలు జరిగేవి. కొంతకాలం పొట్టేళ్ల సంత సైతం నడిచింది. దీనివల్ల గ్రామ పంచాయతీకి మంచి ఆదాయం కూడా సమకూరేది. ఈ దశలో నియోజకవర్గంలోని ఓ కీలక వైకాపా నాయకుడి కళ్లు ఈ సంతపై పడ్డాయి. ఆయన మూడో కంటికి తెలియకుండా దీనికి కోలుకోలేని దెబ్బ కొట్టారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని చిలకలూరిపేటలోని సంతకు పోటీ లేకుండా చేసేందుకు గానూ జిల్లాలోని ఈ సంతను మూసివేయించారు. ఈ వ్యవహారంలో ప్రైవేటు వ్యక్తులు సదరు నాయకుడికి బాగానే ముట్టజెప్పినట్లు ప్రచారం జరిగింది. ఆ తర్వాత కూడా కొందరు కొనుగోలు, విక్రయదారులు స్థానిక సంత వద్దకు వస్తుండటంతో వారిపై బెదిరింపుల పర్వం మొదలైంది. దీంతో గత్యంతరం లేక జిల్లా రైతులు చిలకలూరిపేటకు వెళ్లి మూగజీవాలు విక్రయించుకుని వచ్చేవారు. తదనంతరం అప్పటి ఏఎంసీ పాలకవర్గం సంత పునరుద్ధరణకు శతవిధాలా ప్రయత్నించినా..కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. ప్రస్తుతం మార్కెట్ అంతా శిథిలమై పిచ్చి మొక్కలతో దర్శనమిస్తోంది.



### ఉన్న ఒక్కగానొక్కటీ..

మరోవైపు జిల్లాలో ఉన్న ఒక్కగానొక్క సింగరాయకొండ ప్రైవేటు సంత కూడా మూతపడింది. మొన్నటి వరకూ ఆ ప్రాంతానికి వెళ్లి జిల్లాలోని పశుపోషకులు మూగజీవాల కొనుగోళ్లు, విక్రయాలు చేసేవారు. అయితే ఇది కూడా లేకపోవడంతో రైతన్నలు, వ్యాపారులు ఉసూరుమంటున్నారు. దీంతో చేసేదేమీ లేక నెల్లూరు జిల్లాకు వెళుతున్నారు. ప్రస్తుతం పశువుల కొనుగోలు కన్నా..రవాణా ఛార్జీలే ఎక్కువవుతున్నాయని పశుపోషకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు వీటిని పునఃప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

### ఏటా రూ.25 లక్షల రాబడి

సంతనూతలపాడులో ఉన్న మద్దిపాడు ఏఎంసీలో ప్రతి గురువారం పశువుల సంత జరిగేది. ప్రతి వారం సీజన్‌లో 400 నుంచి 450 పశువుల వరకు వచ్చేవి. ఎండాకాలంలో 250 నుంచి 300ల వరకు వచ్చేవి. ప్రతి ఏటా ఏఎంసీకి ఈ సంతపై రూ.25 లక్షల వరకు సెస్ రూపంలో రాబడి వచ్చేది. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని ఏఎంసీ కార్యదర్శి దానమ్మ పేర్కొన్నారు.

### తిరిగి ఏర్పాటు చేసేందుకు చర్యలు

సంతనూతలపాడు సంతను తిరిగి ఏర్పాటు చేయడాన్ని పరిశీలిస్తున్నాం. ఈ విషయం మా దృష్టికొచ్చింది. సంబంధిత శాఖాధికారులతో చర్చిస్తున్నాం. తిరిగి ఏర్పాటు చేసేందుకు తగు చర్యలు తీసుకుంటాం. – బీఎన్ విజయ్‌కుమార్, ఎమ్మెల్యే



## ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే ఉపేక్షించొద్దు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే ఉపేక్షించవద్దని, బాధ్యులపై కేసులు నమోదు చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. స్థానిక ప్రకాశం భవన్‌లో మంగళవారం జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులకు అవగాహన కల్పించాలన్నారు. సింగరాయకొండ వద్ద జాతీయ రహదారిపై విమానాల అత్యవసర ల్యాండింగ్ కోసం నిర్మించిన స్ట్రేచ్‌లో అధికంగా ప్రమాదాలు జరుగుతుండటం ఏమిటని ప్రశ్నించారు. పోలీసులు, వైద్యులు, ఇతర అధికారులు ఐ-ర్యాడ్ యాప్‌ను సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. మద్దిచెట్లపాలెం నుంచి చీమకుర్తి వరకు దెబ్బతిన్న రహదారికి తక్షణమే మరమ్మతులు చేపట్టడానికి క్వారీల యజమానుల సహాయం తీసుకోవాలని ఆర్అండ్‌బీ, గనుల శాఖ అధికారులను ఆదేశించారు. సింగరాయకొండ వద్ద లైటింగ్, ఇతర ఏర్పాట్లు చేయడానికి విమానయాన శాఖ నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉందని అధికారులు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో ఏఎస్పీ నాగేశ్వరరావు, డీటీసీ సుశీల, జీజీహెచ్ సూపరింటెండెంట్ దుర్గాదేవి, ఆర్అండ్‌బీ ఎస్ఈ దేవానందం తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, చిత్రంలో ఏఎస్పీ నాగేశ్వరరావు, డీటీసీ సుశీల

## బాల కార్మికులతో పనిచేయిస్తే చట్టరీత్యా చర్యలు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: 16 సంవత్సరాలలోపు బాలలతో పని చేయిస్తే వారిని ఆయా సంస్థల యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు జిల్లా ఉప కార్మిక కమిషనర్ ఎ.గాయత్రిదేవి తెలిపారు. పాన్ ఇండియా చైల్డ్ లేబర్ ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా స్థానిక కలెక్టరేట్ వద్ద మంగళవారం అవగాహన కల్పించారు. అనంతరం ఒంగోలు నగరంలోని గాంధీ రోడ్డు, వీఐపీ రోడ్డు, స్థానిక దక్షిణ బైపాస్‌లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో నలుగురు బాల కార్మికులను గుర్తించి వారికి పని నుంచి విముక్తి కల్పించారు. కార్యక్రమంలో సహాయ కార్మికశాఖ అధికారిణి ఎం.ఎలిజబెత్తమ్మ, పోలీసు, సాంఘిక సంక్షేమశాఖ అధికారులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో ప్రదర్శన నిర్వహిస్తున్న అధికారులు

## సాంకేతిక పరిజ్ఞానంతో నేరాల కట్టడి

- గుంటూరు రేంజ్ ఐజీ త్రిపాఠి ఆదేశాలు

ఈనాడు, అమరావతి: సాంకేతిక పరిజ్ఞానంతో నేరాలకు అడ్డుకట్ట వేయాలని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి పిలుపునిచ్చారు. కేసుల దర్యాప్తుల్లో సాంకేతికతను జోడిస్తే ఫలితాలు వేరుగా ఉంటాయని చెప్పారు. ఇటీవల బాపట్ల జిల్లా మేదరమెట్ల స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఓ దారి దోపిడీని కేవలం 48 గంటల్లో ఛేదించడానికి ఆ పరిజ్ఞానమే దోహదపడిందన్నారు. మంగళవారం సాయంత్రం రేంజ్ పరిధిలోని గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల ఎస్పీలతో ఆయన గుంటూరులోని తన ఛాంబర్‌లో సమీక్షించారు. తెదేపా కేంద్ర కార్యాలయం, చంద్రబాబునాయుడు నివాసంపై గతంలో జరిగిన దాడుల కేసుల పురోగతి, ఆధారాలు ఎలా సేకరించిందీ ఎస్పీలకు వివరించారు. రఘురామకృష్ణరాజు కేసు పురోగతిపైనా చర్చించారు. ప్రతి స్టేషన్ పరిధిలో సీసీ కెమెరాలతో గట్టి నిఘా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎక్కడ ఏ నేరం జరిగినా వెంటనే సీసీ కెమెరాల ద్వారా గుర్తించేలా అవి ఉండాలని సూచించారు. గతంలో మాదిరి ప్రతీ కానిస్టేబుల్‌కు ఒక ప్రాంతాన్ని దత్తత ఇచ్చి అక్కడ ఏం జరిగినా సమాచారం వచ్చేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఎస్పీలు సతీష్‌కుమార్ కె.శ్రీనివాసరావు, తుషార్ డూడీ, దామోదర్, కృష్ణకాంత్ పాల్గొన్నారు.



దీపారాధన చేసి వార్షికోత్సవాన్ని ప్రారంభిస్తున్న శ్రీభ్రమర టౌన్‌షిప్స్ ఛైర్మన్ గల్లా రామచంద్రరావు

## అన్ని వసతులతో సొంతింటి కల సాకారం

గుంటూరు(పట్టాభిపురం), న్యూస్‌టుడే: అత్యాధునిక వసతులతో ప్రజలకు సొంతింటి కల సాకారం చేస్తున్నామని శ్రీభ్రమర టౌన్‌షిప్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ గల్లా రామచంద్రరావు పేర్కొన్నారు. గుంటూరు రింగ్‌రోడ్డులోని సిద్ధార్థ గార్డెన్స్‌లో శ్రీభ్రమర హౌసింగ్ సంస్థ వార్షికోత్సవం మంగళవారం నిర్వహించారు. రామచంద్రరావు మాట్లాడుతూ ఇప్పటి వరకు 9,000 మందికి పైగా సొంతింటి కల సాకారం చేశామన్నారు. నిర్మాణ రంగంలో కొత్తదనం సృష్టించాలన్న ఆశయంతో 2015లో శ్రీభ్రమర టౌన్‌షిప్స్‌ను ప్రారంభించామని తెలిపారు. గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో 30కి పైగా అద్భుతమైన ప్రాజెక్టులకు రూపకల్పన చేసి అభివృద్ధి చేసి స్థిరాస్తి రంగంలో ప్రత్యేక ముద్ర వేశామని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో సైతం ఆధునిక సౌకర్యాలతో ప్రాజెక్టులు చేపట్టి నగర జీవనశైలిని సమతుల్యం చేసేందుకు శ్రీభ్రమర కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు మారం చంద్రశేఖర్, ఎం.ఎస్.రాజు, లక్ష్మీపతిరాజు, శైలారెడ్డి, యడ్లపల్లి మురళీకృష్ణ, రావెల గోపాలకృష్ణ, కాకర్ల సతీష్, కమ్మ రవి పాల్గొన్నారు.

## 25న అండర్ 19 క్రీడా పోటీలు

ఒంగోలు నగరం: జూనియర్ కళాశాలల అండర్ 19 క్రీడా పోటీలు ఈ నెల 25న సింగరాయకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతాయని ఆర్ఐవో సైమన్‌విక్టర్ పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి నెట్‌బాల్, బ్యాడ్మింటన్, క్యారమ్స్, సైక్లింగ్ తదితర పోటీలు నిర్వహిస్తారన్నారు.

## దొంగల పరుగో.. పరుగు!

కురిచేడు: రాగి తీగను దొంగిలిస్తున్న చోరులను గొర్రెల కాపరులు వెంటాడటంతో వారు పరుగులు తీశారు. ఈ సంఘటన ఆవులమంద రహదారిలో మంగళవారం చోటుచేసుకుంది. కురిచేడు గ్రామస్థుల కథనం మేరకు కురిచేడు - ఆవులమంద రహదారి పక్కన చెట్ల పొదల్లో వ్యవసాయ మోటారు దాచి, అందులోని రాగి తీగ చోరీ చేస్తుండగా.. అటుగా గొర్రెల కాపరులు రావడంతో వారు ఒక్క ఉదుటున పరారయ్యారు. ఇటీవల రాగి తీగల చోరీలు అధికమయ్యాయని రైతులు చెబుతున్నారు.

## జీజీహెచ్‌లో వసతి ఏర్పాటుకు ఆదేశం

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: సర్వజన ఆసుపత్రికి వచ్చే రోగుల సహాయకుల కోసం వసతి ఏర్పాటు చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి ఏపీ ఎంఎస్ఐడీసీ అధికారులను ఆదేశించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ దుర్గాదేవి ఇంజినీరింగ్ సిబ్బంది మంగళవారం మంత్రిని నాయుడుపాలెం క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో సేవలు, సౌకర్యాల గురించి చర్చించారు. గైనికాలజీ విభాగంలోని రోగుల కోసం ఎక్కువమంది సహాయకులు వస్తున్నారని, వారంతా వరండాల్లో పడుకొని ఇబ్బందుపడుతున్నారన్నారు. కొంతమంది రోగులు రాత్రిపూట ఉండాల్సి వస్తుందన్నారు. అలాంటి వారి కోసం దుస్తులు మార్చుకునే గదితో కూడిన డార్మెట్రీ ఏర్పాటు చేయాలన్నారు. దానికోసం వెంటనే ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. ఇటీవల మంత్రి జీజీహెచ్‌ని పరిశీలించిన అనంతరం తీసుకున్న చర్యలు గురించి వివరించారు. అత్యవసర మరమ్మతుల కోసం ఎన్టీఆర్ వైద్యసేవ నిధులు రూ.4 లక్షలు కలెక్టర్ విడుదల చేసినట్లు వివరించారు. మరమ్మతులు సకాలంలో పూర్తిచేయాలని మంత్రి ఆదేశించారు. ఆసుపత్రిలో నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. అత్యవసర పనుల కోసం ఎన్టీఆర్ వైద్యసేవ నిధులు వినియోగించుకోవాలన్నారు.



మంత్రి స్వామికి పుష్పగుచ్ఛం అందిస్తున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ దుర్గాదేవి

# వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి దుర్మరణం

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: జిల్లాలో వేర్వేరు ప్రాంతాల్లో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. తాలూకా పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఒంగోలు వైపు నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న కారును వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన లారీ బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తెలంగాణ రాష్ట్రం ఆదిలాబాద్‌కు చెందిన మొండయ్య (45) తీవ్రంగా గాయపడ్డారు. ఆయన్ను స్థానికులు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ మేరకు తాలూకా పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

### స్నేహితులతో మాట్లాడుతూనే అనంతలోకాలకు..

బేస్తవారపేట, న్యూస్‌టుడే: రోడ్డు పక్కన స్నేహితులతో మాట్లాడుతున్న వ్యక్తిని బొలేరో వాహనం ఢీకొనడంతో ఆయన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఘటన బేస్తవారపేటలోని అమరావతి-అనంతపురం జాతీయ రహదారిపై మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..మార్కాపురం మండలం నికరంపల్లికి చెందిన అన్నపురెడ్డి రామకృష్ణారెడ్డి (55) కౌలు రైతు. సోమవారం తోటి స్నేహితులైన సత్యాలురెడ్డి, ఖాజాలతో కలిసి తర్లుపాడు మండలంలోని గొల్లపల్లిలో జరిగిన స్నేహితుడి పెద్ద కర్మకు వెళ్లారు. కార్యక్రమం ముగించుకుని వచ్చే సరికి రాత్రి కావడంతో బేస్తవారపేట కూడలిలోని కాశీనాయన లాడ్జిలో బస చేశారు. మంగళవారం తెల్లవారుజామున సత్యాలురెడ్డి, ఖాజా గుంటూరు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. లాడ్జి వద్ద రహదారి పక్కన కారును నిలిపి వారు రామకృష్ణారెడ్డితో మాట్లాడుతుండగా బొలేరో వాహనం దూసుకొచ్చి రామకృష్ణారెడ్డిని ఢీకొనడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుడిని స్నేహితులు 108 వాహనంలో కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుడికి భార్య రామలక్ష్మమ్మ, కుమారులున్నారు. కుటుంబ సభ్యులిచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవీంద్రారెడ్డి తెలిపారు.



అన్నపురెడ్డి రామకృష్ణారెడ్డి

### ఆటో, ద్విచక్ర వాహనాలను ఢీకొంటూ..

ముండ్లమూరు: అదుపు తప్పిన కారు ఆటో, ద్విచక్ర వాహనాలను ఢీకొంటూ దూసుకెళ్లింది. ఈ ప్రమాదం అద్దంకి- దర్శి ప్రధాన రహదారిలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు దర్శి నుంచి పసుపుగల్లుకు కూలీలు ఆటోలో వెళ్తున్నారు. ఈ వాహనాన్ని అద్దంకి నుంచి దర్శి వైపు వెళుతున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న సందువారిపాలేనికి చెందిన శివలీలకు కాలి వేళ్లు తెగి పడ్డాయి. అప్పటికీ కారు వేగం అదుపుకాకపోవడంతో అదే మార్గంలో వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొనగా; కట్టుబడివారిపాలేనికి చెందిన ఐ.నాగేష్‌కు గాయాలయ్యాయి. 108 వాహనంలో దర్శి ప్రభుత్వవైద్యశాలకు తరలించారు.

### మద్యం లారీ బోల్తా

కంభం (రాచర్ల): రాచర్ల మండలం చెర్లోపల్లి సమీపంలో మద్యం లోడుతో వెళ్తున్న లారీ అదుపు తప్పి బోల్తా పడింది. నంద్యాల నుంచి విజయవాడకు మద్యం లోడుతో వెళ్తున్న లారీకి గేదె అడ్డు వచ్చింది. దాన్ని తప్పించే క్రమంలో అదుపు తప్పి బోల్తా పడింది. లారీ డ్రైవర్, క్లీనర్‌కు గాయాలయ్యాయి.



ప్రమాదానికి గురైన లారీ

| నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర |
|---|
| ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 540 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-. |

| ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో) |
|---|
| వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 133, రిటైల్ లైవ్ - 155, చికెన్ విత్ స్కిన్ - 225, చికెన్ స్కిన్‌లెస్- 256 |






మార్కాపురం: వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు, విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేస్తున్న పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, ఇతర సిబ్బంది

# మార్కాపురం

•మార్కాపురం • గిద్దలూరు • యర్రగొండపాలెం

## పారిశుద్ధ్యం మెరుగుపై ప్రత్యేక దృష్టి

పొదిలి, న్యూస్‌టుడే: పొదిలి మండలంలోని అన్ని పంచాయతీల్లో పారిశుద్ధ్యం మెరుగుకు ప్రత్యేక దృష్టి సారించాలని మండల ప్రత్యేకాధికారి పి.విద్యాసాగర్ చెప్పారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో వివిధశాఖల అధికారులతో సమావేశమై మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో శోభన్‌బాబు, ఎంఈవో ఎం.శ్రీనివాసులరెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ నారాయణస్వామి, పంచాయతీరాజ్ అధికారులు తదితరులు హాజరయ్యారు.

## పంటల పరిశీలన

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: జమ్మిదోర్నాల, చిన్నదోర్నాల గ్రామాల్లో మంగళవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి డి.జవహర్‌లాల్‌నాయక్ పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు. పత్తి, మిరప పంటలను ఆయన పరిశీలించారు. రబీ కాలంలో ఆరుతడి పంటలైన మినుము, శనగ, జొన్న, రాగులు పంటలు సాగు చేయాలని ఆయన సూచించారు.

## ఉత్సాహంగా ప్రతిభా పాటవ పోటీలు

మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే: మార్కాపురం పట్టణంలోని శ్రీసాయి చైతన్య పాఠశాలలో మంగళవారం ఈనాడు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై విద్యార్థులు విశ్లేషించి తమకు ఎదురైన అనుభవాలను వివరించారు. జి.నిత్యశ్రీ(8వ తరగతి), బి.సుప్రజ(9వ తరగతి), కె.నాగఅంజలి(8వ తరగతి)లు ప్రతిభ చూపి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. అనంతరం వారికి ప్రిన్సిపల్ ఎం.శ్రీనివాసరావు, కరస్పాండెంట్ ఎం.చంద్రశేఖర్, సిబ్బంది బహుమతులు, ప్రశంసా ప్రతాలు అందజేశారు.

● గిద్దలూరు పట్టణం: ముండ్లపాడు గ్రామంలోని గంజి భద్రయ్య మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనాడు ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 'అంతర్జాలం వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం అన్న అంశంపై విద్యార్థులు తమ అభిప్రాయాలు పంచుకున్నారు. నజీర్‌బాషా (10వ తరగతి), మణికంఠ రాయల్ (9వ తరగతి), చిన్న వెంకటేశ్వర్లు (10వ తరగతి) ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు దక్కించుకున్నారు. వారికి ప్రధానోపాధ్యాయురాలు కె.లక్ష్మీదేవి, ఉపాధ్యాయులు మోహన్‌రెడ్డి, రఫీ, దస్తగిరి, జాన్సన్ బహుమతులు అందజేశారు.






గిద్దలూరు: వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు, ప్రశంసా ప్రతాలు అందుకున్న విజేతలతో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు

## విస్తరిస్తామన్నారు.. విస్మరించారు..

■ రహదారి అభివృద్ధి గాలికొదిలేసిన గత ప్రభుత్వం

మార్కాపురం, న్యూస్‌టుడే:

మార్కాపురం పరిధిలో రహదారుల అభివృద్ధిని గత వైకాపా ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. కొత్తవి నిర్మించడం అటు ఉంచితే.. ఉన్నవాటికి కనీసం తట్టెడు మట్టి పోసి బాగు చేసింది లేదు. అయిదేళ్ల పాలనలో ప్రజలు అధ్వాన రోడ్లపై ప్రయాణిస్తూ నరకయాతన అనుభవించారు. కొందరు ప్రాణాలు సైతం పోగొట్టుకున్నారు. పలు రకాలుగా అన్ని రాజకీయ పార్టీలు ఆందోళనలు చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. ప్రజలకు అవసరమైన కనీస వసతులను సైతం గత ప్రభుత్వం కల్పించలేకపోయింది.



చెరువు కట్ట రోడ్డు ఇలా..

### బిల్లులు రావని.. పనులు నిలిపేసి..

మార్కాపురం పట్టణంలోని ఎస్టేట్ వై జంక్షన్ కూడలిలో ఉన్న చెరువు అలుగు నుంచి ఆకాశవాణి కేంద్రం మీదుగా కంభం బస్టాండ్ కూడలి వరకు రహదారిని విస్తరించాలని భావించారు. చెరువు కట్టను పూర్తి స్థాయిలో వెడల్పు చేసి హైదరాబాద్‌లో ఉన్న ట్యాంక్‌బండ్ మాదిరిగా అభివృద్ధి చేయడానికి గత వైకాపా ప్రభుత్వం 2020లో ఎండీబీ నిధులు రూ.11 కోట్లను మంజూరు చేసింది. నిర్మాణ పనులు జేఎంసీ గుత్తేదారు సంస్థ దక్కించుకుంది. ఈ సంస్థ ఈ రహదారినే కాకుండా మార్కాపురం డివిజన్‌లోని పలు పనులను టెండర్లు దక్కించుకుంది. ఈ సంస్థ పనులు చేసిన వాటికి బిల్లులు చెల్లించలేదనే కారణంతో మురుగు కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణం తదితర పనులు ప్రారంభించలేదు.



మార్కాపురం ఆకాశవాణి కేంద్రం దగ్గర నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే రహదారిలో ఏర్పడిన గోతులు

### గోతులమయంగా మారి..

గత పాలకులు చెరువును అభివృద్ధి చేస్తున్నాం. మార్కాపురం-రైల్వేస్టేషన్ రహదారి బాగుపడనుందని హడావుడి చేశారు. పనులు చేయకుండానే అయిదేళ్ల కాలం పూర్తి అయిపోయింది. సమస్య మాత్రం అలానే మిగిలిపోయింది. ఈ రహదారి సుమారు 2.15 కిలోమీటర్ల మేర ఉంటుంది. అది అభివృద్ధికి నోచుకోక భారీ స్థాయిలో అనేక చోట్ల గోతులు ఏర్పడ్డాయి. ఆకాశవాణి కేంద్రం దాటిన తర్వాత మరీ అధ్వానంగా మారిపోయింది. పెద్ద పెద్ద గుంతలు ఉన్నాయి. దీని వల్ల మార్కాపురం నుంచి రైల్వేస్టేషన్‌కు, ఎస్టేట్, ఏకలవ్యనగర్, డ్రైవర్స్‌కాలనీకి వెళ్లే వాసులతో పాటు మార్కాపురం నుంచి ఒంగోలు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ కూటమి ప్రభుత్వం అయినా రహదారిని బాగు చేయించాలని పుర ప్రజలు కోరుతున్నారు.

## కార్మికుల తొలగింపు దుర్మార్గమైన చర్య

మార్కాపురం, న్యూస్‌టుడే: మార్కాపురం పురపాలిక సంఘంలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులను ఎటువంటి కారణాలు లేకుండా తొలగించడం అన్యాయమని మార్కాపురం యూనిట్ ఏపీఎన్జీవో డివిజన్ అధ్యక్షుడు బి.శ్రీనివాసశాస్త్రి విమర్శించారు. కార్మికుల తొలగింపుపై స్థానిక సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం ఉద్యోగ, కార్మిక, ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 25 ఏళ్లుగా పురపాలికవాసుల కోసం అతి తక్కువ వేతనాలతో పని చేస్తున్న వారిని తొలగించాలనుకోవడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. ఏఐటీయూసీ జిల్లా నాయకుడు అందె నాసరయ్య మాట్లాడుతూ.. కార్మికులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వం మనుగడ సాగించలేదన్నారు. అనంతరం ఎపీఎజ్ రాష్ట్ర నాయకుడు అబ్దుల్ రజాక్ మాట్లాడుతూ.. మున్సిపల్ అధికారులు తక్షణమే వారి మొండి వైఖరిని వీడాలనీ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలన్నారు. సమావేశంలో మాల మానాడు నాయకుడు నూతలపాటి దేవరాజ్, పట్టణ పౌర సంఘాల సమైక్య నాయకుడు దగ్గుపాటి సోమయ్య, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.




రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎన్జీవో డివిజన్ కార్యదర్శి శ్రీనివాసశాస్త్రి



మాట్లాడుతున్న తెదేపా నేత ఎరిక్షన్‌బాబు

## తెదేపా సభ్యత్వంతో కుటుంబాలకు భరోసా

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకుని తమ కుటుంబాలకు భరోసా పొందాలని తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు సూచించారు. పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు ఈ నెల 26 నుంచి నిర్వహించే సభ్యత్వ నమోదు కార్యక్రమంపై స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం బూత్, యూనిట్, క్లస్టర్ ఇన్‌ఛార్జులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.100తో సభ్యత్వం నమోదు చేసుకుంటే రూ.5లక్షల బీమా, మళ్లీ ఖర్చులకు కింద రూ.10వేలు పార్టీ చెల్లిస్తుందన్నారు. తెదేపా నేత షేక్ మాబు సభ్యత్వ నమోదుపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో వై.పాలెం నియోజకవర్గంలోని అయిదు మండలాల పార్టీ అధ్యక్షులు, నాయకులు చేకూరి సుబ్బారావు, వరరాజు, కామేపల్లి తదితరులు పాల్గొన్నారు.

## భూ సమస్యల పరిష్కారానికి గ్రామసభలు

కంభం, న్యూస్‌టుడే: భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం గ్రామ సభలు నిర్వహిస్తోందని తహసీల్దార్ కిరణ్ అన్నారు. మండలంలోని జంగంగుంట్ల గ్రామంలో మంగళవారం రీ సర్వేపై గ్రామ సభ నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ 24న నడింపల్లి, 26న కాగితాల గూడెం, 29న కందులాపురం గ్రామాల్లోనూ సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

## విస్తృతంగా పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

మార్కాపురం, న్యూస్‌టుడే: మార్కాపురం మండలంలో భారీ వర్షాలు కురుస్తున్నందున అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని.. తక్షణమే గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని మార్కాపురం ఇన్‌ఛార్జి డీఎల్‌పీవో వై.భాగ్యవతి సూచించారు. స్థానిక మండల పరిషత్తు అభివృద్ధి కార్యాలయంలో మంగళవారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, వైద్యఆరోగ్యశాఖ అధికారులు, సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ నెలలో జిల్లా కలెక్టర్ పర్యటన ఉన్నందున గ్రామాల్లోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. వైద్యఆరోగ్యశాఖ అధికారులు వ్యాధులు ప్రబలకుండా ముందస్తు వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు.




ఎంపికైన వారితో ప్రిన్సిపల్ శ్రీధర్‌నాయుడు, కంపెనీ ప్రతినిధులు

## 34 మందికి ఉద్యోగాలు

యర్రగొండపాలెం పట్టణం: నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో ఉద్యోగ మేళా నిర్వహించారు. మొత్తం 63 మంది హాజరు కాగా.. వారిలో 34 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ మేళాలో అమర్‌రాజా బ్యాటరీ, రెన్యూవేస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపల్ శ్రీధర్ నాయుడు మాట్లాడుతూ.. నిరుద్యోగ యువత ఇటువంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్ ప్రిన్సిపల్ ప్రదీప్, సిల్క్ హబ్ కోఆర్డినేటర్ విజయకుమారి, ఆయా కంపెనీ ప్రతినిధులు బాలు, బాషా తదితరులు పాల్గొన్నారు.



## ప్రకృతి ఒడిలో ఉల్లాసం

నల్లమలలో పుణ్యక్షేత్రమైన శ్రీశైలానికి నిత్యం వేలాది మంది భక్తులు పెద్దదోర్నాల మీదుగా వెళుతుంటారు. పెద్దదోర్నాల నుంచి శ్రీశైలానికి వెళ్లే రహదారిలోని గణపతి దేవాలయం సమీపంలో అటవీశాఖ చెక్‌పోస్టు వద్ద పర్యాటకుల కోసం ప్రభుత్వం అడ్వెంచర్ పార్కు ఏర్పాటు చేస్తోంది. ఆ ప్రాంతంలోని పిచ్చి మొక్కలు తొలగించి మొక్కలను నాటి చెట్లను పెంచింది. పర్యాటకులతో పాటు స్థానికుల కోసం అక్కడ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేశారు. చిన్నారులు ఆడుకునేందుకు.. యువత వ్యాయామం చేసేందుకు పరికరాలను ఏర్పాటు చేసింది. దానిని త్వరలో ప్రారంభించనుంది. అందుబాటులో వస్తే స్థానికులు, పర్యాటకులు కాసేపు ప్రకృతి ఒడిలో సేద తీరే అవకాశం లభించనుంది. –న్యూస్‌టుడే, పెద్దదోర్నాల



పార్కులో ఏర్పాటు చేసిన క్రీడా పరికరాలు

## నిరుపయోగంగా ప్రసూతి గదులు



ప్రసూతి విశ్రాంతి గదులు

స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న ప్రసూతి విశ్రాంతి గదులు నిరుపయోగంగా మారాయి. ప్రభుత్వం 15 ఏళ్ల కిందట చెంచు గిరిజన మహిళలు ప్రసవం అయిన తర్వాత ఉండేందుకు మూడు గదులను నిర్మించింది. మొదట్లో వినియోగించినా కాలక్రమేణా నిర్వహణను పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారాయి. దీంతో ఆ గదులు శిథిలావస్థకు చేరాయి. ఫలితంగా గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి వాటిని మరమ్మతులు చేసి వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, పెద్దదోర్నాల

## గుంతల దారి.. అవస్థగా మారి..

ఈ చిత్రంలో గుంతలతో కనిపిస్తున్న రహదారి ఏ మారుమూల పల్లెకు వెళ్లే రోడ్డే అనుకుంటే పప్పులో కాలేసినట్లే. మార్కాపురం పట్టణం నుంచి తర్లుపాడు వెళ్లే రహదారి ఈ విధంగా తయారైంది. గత పాలకులు కనీసం గుంతలు పూడ్చిన పాపాన పోలేదు. వర్షం పడిందంటే ఇక వాహనదారులకు చుక్కలే. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఈ రోడ్డు మరింత అధ్వానంగా మారింది. ప్రధానంగా ఎల్వీప్రసాద్ కంటి ఆసుపత్రి వద్ద రోడ్డంతా రూపురేఖలు కోల్పోయింది. పలువురు వాహనదారులు సైతం ఆ ప్రాంతంలో ప్రమాదాలకు గురయ్యాయి. అయినప్పటికీ ఈ రోడ్డును అలానే వదిలేశారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వమైనా గుంతలు పూడ్చాలని ప్రజలు కోరుతున్నాం. – న్యూస్‌టుడే, మార్కాపురం పట్టణం



పూలసుబ్బయ్య కాలనీ సమీపంలోని ఎల్వీప్రసాద్ కంటి ఆసుపత్రి వద్ద గోతులమయంగా మారిన రోడ్డు

## ద్విచక్రవాహనదారుడికి గాయాలు

కంభం: గేదె ఢీకొని ద్విచక్రవాహనదారునికి గాయాలైన సంఘటన పట్టణ సమీపంలోని జాతీయ రహదారి పై వంతెన సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. పెద్దారవీడు మండలం పుచ్చకాయలపల్లికి చెందిన మోచర్ల చిన్నమల్లయ్య ద్విచక్రవాహనంపై మార్కాపురం నుంచి కంభం వస్తుండగా.. గేదె అడ్డురావడంతో దాన్ని ఢీకొట్టాడు. ఈ క్రమంలో అతడికి గాయాలయ్యాయి. క్షతగాత్రున్ని కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స చేయించారు.

## జూద శిబిరంపై దాడి

బేస్తవారపేట: మండలంలోని చెట్టిచర్ల రోడ్డులో జూద శిబిరం నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో మంగళవారం ఎస్సై రవీంద్రారెడ్డి సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. అయిదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.2,020 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.



## ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం సందర్శన

పొదిలి గ్రామీణం, న్యూస్‌టుడే: ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా కేంద్ర వైద్య బృందం మంగళవారం మండలంలోని కాటూరివారిపాలెంలోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం సందర్శించారు. ఈ సందర్భంగా వారు కేంద్రంలో అందుతున్న వైద్య సేవలు గురించి వివరాలు సేకరించి, దస్త్రాలు పరిశీలించారు. అనంతరం సిబ్బందికి తగు సూచనలు చేశారు. జిల్లా గణాంకాధికారి ప్రసాద్, డీపీఎంయూ సుబ్బలక్ష్మి, ఉప్పలపాడు పీహెచ్‌సీ వైద్యులు సుగుణకుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

**మేమున్నాం.. మీకు తోడుగా..** (10 AM TO 1 PM)
మార్కాపురం : 8008631313
గిద్దలూరు పట్టణం: 8008574135
యర్రగొండపాలెం : 8008552658
పొదిలి : 8008550360
కంభం : 8008632343

త్రిపురాంతకం గ్రామీణం, న్యూస్‌టుడే:

సమస్య: మానేపల్లి రహదారిలోని మేడపి-ఎండూరివారిపాలెం రహదారి పనులు మధ్య వదిలేయడంతో వర్షం కురిసినప్పుడు ఆ దారంతా మోకాళ్ల లోతు నీరు చేరి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. – ఎం.ఈశ్వరయ్య, ఎండూరివారిపాలెం
సమాధానం: సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. నిధులు మంజూరు కాగానే రహదారి ఆధునికీకరణ పనులు చేపట్టి ఇబ్బందులు లేకుండా చేస్తాం. –సుబ్బారెడ్డి, పంచాయతీరాజ్ డీఈఈ

కొనకనమిట్ల, న్యూస్‌టుడే:

సమస్య: కొనకనమిట్ల బస్టాండ్ సెంటర్ సీసీ రోడ్డుపై వాన కురిసిన ప్రతిసారీ వర్షపు నీరు నిలుస్తోంది. అందులో నుంచే ద్విచక్ర వాహనదారులు, పాదచారులు రాకపోకలు సాగిస్తూ ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించగలరు. – వెంకటేశ్వర్లు, స్థానికుడు
సమాధానం: నీరు నిల్వకుండా చర్యలు తీసుకుంటాం. – శ్రీదేవి, ఈవోఆర్డీ

## బీమా పాలసీలపై జీఎస్టీ ఎత్తివేయాలంటూ నిరసన

మార్కాపురం పట్టణం: ఎల్ఐసీ అవలంబిస్తున్న తీరుపై మంగళవారం స్థానిక ఎల్ఐసీ కార్యాలయం ముందు ఏజెంట్లు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా లియాఫీ ఏజెంట్ల అధ్యక్షులు ఏవి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. అక్టోబర్ 1వ తేదీ నుంచి ఏజెంట్లకు కమీషన్ తగ్గించిందన్నారు. దీన్ని వెంటనే విరమించుకోవాలని వారు డిమాండ్ చేశారు. అదే విధంగా బీమా పాలసీలకు జీఎస్టీ నుంచి మినహాయించాలని.. బోనస్ పెంచాలని కోరారు. లియాఫీ డివిజన్ కార్యదర్శి అల్లూరయ్య, అధ్యక్షులు సుబ్రమణ్యం, ఇమాం సాహెబ్, ఆంజనేయులు పాల్గొన్నారు.



కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేస్తున్న ఏజెంట్లు

## చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

కంభం, న్యూస్‌టుడే: చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై నరసింహారావు అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో మంగళవారం రౌడీషీటర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గొడవలు, అల్లర్లకు పాల్పడకుండా శాంతియుతంగా జీవనం సాగించాలని చెప్పారు.

## ఆధార్ కేంద్రాల తనిఖీ

కంభం: మండలంలోని తురిమెళ్ల, కందులాపురం పంచాయతీల్లోని ఆధార్ కేంద్రాలను ఎంపీడీవో వీరభద్రాచారి మంగళవారం తనిఖీ చేశారు. మెరుగైన సేవలు చేయాలని సిబ్బందికి సూచించారు. ప్రజలు ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## సప్లయ్ ఛానెల్ పొంగి.. నివాసాల్లోకి నీరు..

మార్కాపురం: పశ్చిమ ప్రకాశంలో గత వారం రోజులుగా వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. మార్కాపురం, కంభం, బేస్తవారిపేట, అర్ధవీడు మండలాల్లో కురిసిన వానలకు సప్లయ్ ఛానెల్‌లో వరదనీరు చేరుతోంది. కాలువ మొత్తం గుర్రపుడెక్క, వ్యర్థాలు నిండిపోవడంతో ఈ నీరంతా చెరువులోకి వెళ్లడం లేదు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం పట్టణ శివారులోని భగత్‌సింగ్‌కాలనీకి జలమయమైంది. అనుకోకుండా ఆ చానల్‌లోని నీరు భగత్‌సింగ్ కాలనీలోకి రావడంతో మరో బుడమేరుగా మారుతుందోనని కాలనీ వాసులు ఆందోళన చెందారు. సాయంత్రానికి వరద నీరు తగ్గడంతో పెద్దగా ప్రమాదం ఏమి లేదని మార్కాపురం జల వనరులశాఖ డీఈ పౌలురాజు తెలిపారు. కాలనీకి సమీపంలోని ఉన్న కాలువపై కొందరూ దాటడానికి ఇనుప కంచలాంటిది వేయడంతోనే కాలనీలోకి చేరిందని చెప్పారు. త్వరలోనే కాలువలోని గుర్రపుడెక్కను తొలగిస్తామన్నారు.



కాలనీలోకి వచ్చిన వరద నీటిని పరిశీలిస్తున్న అధికారులు

## మద్యం తాగి నడిపితే చర్యలు

బేస్తవారపేట, న్యూస్‌టుడే: మద్యం తాగి వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాలకు కారణం కావద్దని ఎస్సై రవీంద్రారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం సిబ్బందితో మండలంలోని సలకలవీడు రోడ్డులో వాహనాల తనిఖీలు చేపట్టి వాహనదారులకు అవగాహన కల్పించారు. మద్యం తాగి వాహనం నడిపితే లైసెన్స్‌లు రద్దు చేయడంతో పాటు కేసు నమోదు చేసి జైలుకు పంపిస్తామని వాహనదారులను హెచ్చరించారు.

## మద్యం సీసాల పట్టివేత

కంభం, న్యూస్‌టుడే: కంభం నుంచి బేస్తవారపేటకు మద్యం సీసాలతో వెళ్తున్న ఓ వ్యక్తిని మంగళవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 45 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరసింహారావు తెలిపారు.

## భూ వివాదాల వల్లే హత్యాయత్నం

పొదిలి, న్యూస్‌టుడే: భూ వివాదాల వల్లె ఓంకార్ అనే వ్యక్తిపై హత్యాయత్నం జరిగిందని పొదిలి సీఐ టి.వెంకటేశ్వర్లు చెప్పారు. మంగళవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 5న ఓంకార్‌పై రాత్రి వేళ కొంతమంది రాడ్లతో దాడిచేశారు. గతంలో పొదిలికి చెందిన పోలా రమేష్ అనే వ్యక్తికి ఓంకార్‌కు స్థిరాస్తి వ్యాపారంలో గొడవలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో రమేష్ కిరాయి వ్యక్తులతో హత్యచేసేందుకు ప్రయత్నించాడు. త్వరలోనే అతణ్ని పట్టుకుంటామని.. రమేష్ సమాచారం తెలియజేస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచి వారికి తగిన రివార్డు ఇవ్వనున్నట్లు చెప్పారు.

**మేమున్నాం.. మీకు తోడుగా..** కనిగిరి : 8008574114, దర్శి: 9848 671678, కొండపి: 96424 56296

హనుమంతునిపాడు, న్యూస్‌టుడే:

సమస్య: మండలంలోని కనిగిరి-కంభం రహదారిలో నిత్యం గ్రానైట్ లారీలు రాత్రి వేళల్లో ప్రమాదకరంగా తిరుగుతున్నాయి. రహదారి అంచులు దెబ్బతిని ఉండడంతో కనీసం ఎదురెదురు వాహనాలు తప్పుకొనే పరిస్థితిలేదు. వెంటనే సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి.
-మురహరి నరసయ్య, స్థానికుడు

సమాధానం: ఈ రహదారిలో అక్రమంగా తిరుగుతున్న గ్రానైట్ లారీలపై చర్యలు తీసుకుంటాం.
-దిలీప్‌కుమార్, తహసీల్దార్, హెచ్‌ఎంపాడు

# కనిగిరి

• కనిగిరి • దర్శి • కొండపి

## పంచారామాలకు ప్రత్యేక బస్సులు

కనిగిరి: కార్తిక మాసంలో కనిగిరి డిపో నుంచి పంచారామాలకు ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేయనున్నట్లు కనిగిరి ఆర్టీసీ డీఎం మహ్మద్ సయానా బేగం తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. నవంబరులో ప్రతి ఆదివారం పంచారామాలు, అరుణాచలంలకు కనిగిరి నుంచి ప్రత్యేకంగా బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు.

## ఎమ్మార్పీ ధరలకే మద్యం విక్రయాలు

దర్శి, తాళ్లూరు: ప్రభుత్వ నిబంధనల ప్రకారం మద్యం దుకాణాలు నడపాలని, ఎమ్మార్పీ ధరలకే మద్యాన్ని అమ్మాలని ఎక్సైజ్ సీఐ కె.శ్రీనివాసరావు అన్నారు. దర్శి నియోజకవర్గ పరిధిలో ప్రారంభించిన మద్యం దుకాణాల వద్ద మంగళవారం ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఉదయం 10 నుంచి రాత్రి పది గంటల వరకు దుకాణాలు తెరవాలని, నిబంధనలు అతిక్రమిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


కనిగిరి: విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు


దర్శి: వ్యాసరచన పోటీల్లో విజేతలతో హెచ్‌ఎం వైఎస్‌ఆర్కే.ప్రసాద్, ఉపాధ్యాయులు


సింగరాయకొండ: విజేతలుగా నిలిచిన విద్యార్థులతో ప్రధానోపాధ్యాయురాలు మహాలక్ష్మి, ఉపాధ్యాయులు

## ప్రతిభ చూపి.. బహుమతి సాధించి

విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు 'ఈనాడు' ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాస రచన పోటీలు దోహదపడతాయని ప్రధానోపాధ్యాయులు పేర్కొన్నారు. మంగళవారం కనిగిరి మండలం దిరిశవంచ జడ్పీ ఉన్నత, సింగరాయకొండ బాలికల ఉన్నత, దర్శి మండలం పోతకమూరు జడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఈనాడు ఆధ్వర్యంలో 'ఇంటర్నెట్ వినియోగంతో కలిగే లాభ నష్టాలు- విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ❖ దిరిశవంచ పాఠశాలకు చెందిన వి.హరికావ్య, ఎం.నాగలక్ష్మి, కె.వి.హర్షవర్ధన్‌లు మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. వారికి బహుమతులు, ప్రశంసా పత్రాలను ప్రధానోపాధ్యాయుడు వి.శ్రీనివాసరావు అందజేశారు. ఉపాధ్యాయులు షేక్ ఖాజాహుస్సేన్, పి.రాజ్‌కుమార్, ఎన్.జ్యోతిబాబు, కె.రమణయ్య పాల్గొన్నారు. ❖ సింగరాయకొండ పాఠశాల నుంచి షేక్ జాస్మిన్, షేక్ రియారిజ్వానా, షేక్ రేష్మాశ్రీలు విజేతలుగా నిలిచారు. ప్రధానోపాధ్యాయురాలు మహాలక్ష్మి, ఉపాధ్యాయులు సాంబశివరావు, పవన్‌కుమార్, బాలకోటయ్య, లావణ్య బహుమతులు అందజేశారు. ❖ పోతకమూరు జడ్పీ పాఠశాల నుంచి వి.గంగావైష్ణవి, జీవీఎన్.పవిత్ర, సీహెచ్.విజయలక్ష్మిలు విజేతలు కాగా హెచ్‌ఎం వైఎస్‌ఆర్కే.ప్రసాద్ బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, హనుమంతారెడ్డి, సురేంద్ర, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.
-న్యూస్‌టుడే, కనిగిరి, సింగరాయకొండ గ్రామీణం, దర్శి

## భూ సమస్యలపై అర్జీల స్వీకరణ


టంగుటూరు తహసీల్దార్ ఆంజనేయులుకు అర్జీ ఇస్తున్న పొందూరు గ్రామస్థులు

తాళ్లూరు, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వ హయాంలో అడ్డగోలుగా రీసర్వే చేయడం కారణంగా తప్పులు కోకొల్లలుగా జరిగాయి. భూముల రీసర్వే పూర్తి చేసిన గ్రామాల్లోనూ నష్టపోయిన రైతులకు న్యాయం జరిగేందుకుగాను రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అవకాశం కల్పించి మంగళవారం నుంచి గ్రామసభలను ఏర్పాటు చేసింది. మండలంలోని మల్కాపురం, రాజనగరం గ్రామ సభల్లో 24 మంది రైతులు తమ సమస్యలపై అర్జీలు అందజేశారు. వీటిని వీలైనంత త్వరగా పరిష్కరింపజేస్తామని తహసీల్దారు కె.నాగలక్ష్మి చెప్పారు. డీటీ ప్రశాంత్, సర్పంచి కాలేషావలి పాల్గొన్నారు. ❖ కొండపి గ్రామీణం: మండలంలోని గుర్రపడియలో గ్రామ సభ నిర్వహించారు. తహసీల్దార్ మురళి, సర్వేయర్ ఫయాజ్, రీసర్వే డీటీ కాశయ్యలు భూ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ❖ పొందూరు (టంగుటూరు): మండలంలోని పొందూరులో తహసీల్దార్ ఆంజనేయులు, రీసర్వే డీటీ మాధవి ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. భూ సమస్యలపై 96 అర్జీలు వచ్చాయి. రైతులు, రైతు కూలీ సంఘం నాయకులు మాట్లాడుతూ.. జాయింట్ ఎల్‌పీఎం నంబర్లలో ఉన్న రైతుల భూమిని గతంలో ఉన్న విధంగా ఎవరివి వారికే విడగొట్టి ఇవ్వాలని కోరారు. గత ప్రభుత్వం ఇచ్చిన పాసుపుస్తకాల్లో అనేక తప్పులున్నాయని తెలియజేశారు. ❖ దొనకొండ: మండలంలోని అనంతవరంలో జరిగిన గ్రామసభలో రైతులు 30 అర్జీలు ఇచ్చారు. తహసీల్దార్ రమాదేవి, డీటీ నాగార్జున, సర్వేయర్ దర్బార్ మస్తాన్‌వలి, వీఆర్వో గాలెయ్య పాల్గొన్నారు.

## దొనకొండ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధికి వినతి


కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుతో మాట్లాడుతున్న గొట్టిపాటి లక్ష్మి

దర్శి, దొనకొండ, న్యూస్‌టుడే: దర్శి నియోజకవర్గంలోని దొనకొండ వెనకబడిన ప్రాంతమని, పారిశ్రామిక కారిడార్ ఏర్పాటైతే అభివృద్ధి చెంది యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని నియోజకవర్గ తెదేపా నాయకురాలు గొట్టిపాటి లక్ష్మి అన్నారు. మంగళగిరి సీకే కన్వెన్షన్‌లో జరిగిన డ్రోన్ సమ్మిట్ కార్యక్రమంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడును మంగళవారం ఆమె కలిసి ఈ ప్రాంత సమస్యలను వివరించారు. దర్శి ప్రాంత ప్రజల చిరకాల వాంఛగా ఉన్న దొనకొండ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధికి ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సహకరించాలని కేంద్ర మంత్రిని కోరారు. ఈ ప్రాంతంలో వలసలను నివారించే లక్ష్యంతో విమానశ్రయానికి కేటాయించిన 354 ఎకరాల ప్రభుత్వ భూములను పారిశ్రామిక వాడగా అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని ఆమె కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారని, సంపూర్ణ నివేదికతో సంబంధిత అధికారులతో కలిసి రావాలని కోరినట్లు ఆమె తెలిపారు. ఇదే సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనూ లక్ష్మి కలిశారు.

## పోలీసు అమరవీరులకు నివాళి


పెరిదేపిలో ఆంజనేయులు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎస్సై ప్రేమ్‌కుమార్

కొండపి గ్రామీణం, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా 2008లో బలిమెలలో మావోయిస్టు కాల్పుల్లో ప్రాణాలు విడిచిన జూనియర్ కమాండో మోటా ఆంజనేయులను స్మరించుకుంటూ ఆయన స్వగ్రామం అయిన మండలంలోని పెరిదేపిలోని విగ్రహానికి మంగళవారం పూలమాలలు వేసి పోలీసులు నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంజనేయులు చదువుకున్న ముప్పవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్మించిన స్తూపం వద్ద నివాళులర్పించి విద్యార్థులకు ఆయన త్యాగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ప్రేమ్‌కుమార్, ఏఎస్సై అంకరావు, హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వరరావు, కుటుంబ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఖోఖో క్రీడాకారుల కార్ఖానా

❖ పోటీల్లో కంచర్లవారిపల్లి పాఠశాల విద్యార్థుల సత్తా



న్యూస్‌టుడే, కనిగిరి

**ఆ పాఠశాల ఖోఖో క్రీడా కారులకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ఈ ఒక్క బడి నుంచే ఇప్పటి వరకు వంద మంది ఆటగాళ్లు వివిధ పోటీల్లో సత్తాచాటారు. క్రీడా కోటాలో ఉద్యోగాలు పొందినవారూ ఉన్నారు. ప్రస్తుతం ఆ పాఠశాలలో రాష్ట్ర, జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో తలపడిన క్రీడాకారులు 30 మంది వరకు ఉన్నారు. ఇంతటి విశేషాలు ఉన్న ఆ క్రీడా కార్ఖానా కనిగిరి మండలం కంచర్లవారిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల. ఈ నెల 24 నుంచి కాణిపాకంలో జరిగే జాతీయ సాయి ఖోఖో పోటీల్లో సత్తాచాటేందుకు నిత్యం సాధన చేస్తున్నారు. పీడీ కాశీవిశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు ఖోఖోలో తర్ఫీదు పొందుతున్నారని, దాతల సాయం ఉంటే మరిన్ని విజయాలు సాధించేందుకు అవకాశం ఉందని ప్రధానోపాధ్యాయుడు విజయభాస్కర్‌రెడ్డి చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఇక్కడి విద్యార్థులు సాధించిన విజయాలు, ఇతర వివరాలను తెలుసుకుందామిప్పుడు.**

### లక్ష్యం.. జాతీయ స్థాయి క్రీడాకారిణి



మాది కనిగిరి మండలం నారపురెడ్డిపల్లి. తల్లిదండ్రులు నారాయణరెడ్డి, మంగమ్మలు. ఇప్పటికే అండర్ -14 విభాగంలో చిత్తూరు, గుంటూరు, కాకినాడ, గుడివాడ, బెంగళూరు తదితర ప్రాంతాల్లో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చాటా. కాణిపాకంలోనూ విజయం సాధించేందుకు శిక్షణ పొందుతున్నా. ఖోఖోలో జాతీయ స్థాయి క్రీడాకారిణి కావడమే లక్ష్యం.
– బసిరెడ్డి కల్యాణి, పదోతరగతి

### పూర్వ విద్యార్థుల స్ఫూర్తితో..



కనిగిరి మండలం మండాదివారిపల్లి గ్రామం మాది. తల్లిదండ్రులు కొండారెడ్డి, వెంకటరమణమ్మలు. గుంటూరు, హైదరాబాద్, చిత్తూరు, కాకినాడ, గుడివాడు, విశాఖపట్టణం తదితర ప్రాంతల్లో జరిగిన రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో జిల్లా జట్టు తరపున పాల్గొని మంచి ప్రతిభ చాటి, ఎన్నో బహుమతులు అందుకున్నారు. మా పాఠశాలలో నా కన్నా ముందు పది మంది వరకు బాలికలు రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో రాణించడంతో పాటు క్రీడా కోటాలో ఉద్యోగం కూడా పొందరు. వారే నాకు స్ఫూర్తి.
–సంగటి భానుప్రియ, 10వ తరగతి

### జట్టు విజయంలో కీలకపాత్ర..



కనిగిరి మండలం అడ్డరోడ్డు మా ఊరు. శ్రీనివాసులు, చిన్నక్క మా తల్లిదండ్రులు. చిత్తూరు, కాకినాడ, నర్సారావుపేట, గుంటూరు, జార్ఖండ్ తదితర ప్రాంతాల్లో రాష్ట్ర, జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొని ప్రశంసలు అందుకున్నా. పైగా జట్టు విజయాల్లో కీలకపాత్ర పోషించా. ఖోఖోపై మక్కువ తోనే ప్రైవేటు పాఠశాలలో చేరకుండా కంచర్లవారిపల్లి ఉన్నత పాఠశాలలో చేరా. వచ్చే నెలలో బెంగళూరులో జరిగే జాతీయ స్థాయి పోటీల్లోనూ సత్తా చాటుతా. – తమ్మినేని మనోజ్, ఖోఖో క్రీడాకారుడు

### సీనియర్ల ఆట చూసి..



మాది కంచర్లవారిపల్లి. తల్లిదండ్రులు ఓబులేసు, వెంకటసుబ్బులు. ఇద్దరూ వ్యవసాయ కూలీలే. పాఠశాల గ్రామంలోనే ఉండటంతో రోజు జరిగే ఖోఖో శిక్షణ చూసి ఆటపై మక్కువ పెంచుకున్నా. ఇప్పటికే అండర్-14 విభాగంలో శ్రీకాకుళం, చిత్తూరు, గుంటూరు తదితర ప్రాంతాల్లో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని జట్టుకు పేరు తీసుకొచ్చా. క్రీడాకోటాలో ఎస్సై ఉద్యోగం సాధించడమే నా లక్ష్యం.
– ఈర్ల నందకిశోర్, పదో తరగతి

## వీడని వర్షం.. ఆగని నష్టం


నందనమారెళ్ల వద్ద ఉరకెత్తి చని పోయిన పొగాకు మొక్కలు

కనిగిరి పట్టణంతో పాటు, మండలంలో పదిరోజుల నుంచి వర్షాలు పడుతుండటంతో పంటలు ఉరకెత్తిపోతున్నాయి. ఇప్పటికే సజ్జ పంట పూర్తిగా తుడిచి పెట్టుకుపోయి రైతులు రూ. లక్షల్లో నష్టపోయారు. కందిపంట కొన్ని చోట్ల నీళ్లలో ఉరకెత్తి ఉంది. వరస పెట్టి వర్షాలు కురుస్తున్నందున కందికి కాపు వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని నందనమారెళ్ల, దిరిశవంచ, గానుగపెంట, బడుగులేరు, చల్ల గిరగల ప్రాంతాల్లో పొగాకు పంటలో వర్షపు నీళ్లు నిలిచి మొక్కలు చనిపోయాయి. ఎడతెరిపిలేని వర్షం వల్ల సజ్జ, కందితో పాటు, పొగాకు పంటలకు తీవ్ర నష్టం వాటిల్లినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు కనిగిరి పట్టణంలో మంగళవారం సాయంత్రం కూడా వాన కురిసింది. –న్యూస్‌టుడే, కనిగిరి

## విద్యా ప్రవేశ్‌తో ఉజ్వల భవిత


ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ప్రొఫెసర్ రష్మి, ఎంఈవో నారాయణరెడ్డి తదితరులు

కనిగిరి, న్యూస్‌టుడే: మండలంలోని కొత్తఏరువారిపల్లి ప్రాథమిక పాఠశాలలో 90 రోజుల పాటు నిర్వహించిన విద్యాప్రవేశ్ కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. చివరి రోజు ఎన్‌సీఈఆర్టీ దిల్లీ అసోసియేట్ ప్రొఫెసర్ రష్మి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం చిన్నారులకు ఎంతో ఉపయోగ పడతుందన్నారు. 90 రోజుల పాటు చిన్నారులకు భాషా, అక్షరాస్యత, జ్ఞానాభివృద్ధి, శారీరక అభివృద్ధి, ఆటలు తదితర వాటిని నేర్పించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో యు.నారాయణరెడ్డి, ప్రధానోపాధ్యాయులు వెంకటరెడ్డి, ఫీల్డ్ ఇన్విస్టిగేటర్లు సృజన, శ్రీలత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నగర పంచాయతీ భవనానికి స్థలం కేటాయింపు

దర్శి, న్యూస్‌టుడే: నగర పంచాయతీ నూతన కార్యాలయ నిర్మాణానికి స్థలం కేటాయించినట్లు కమిషనర్ మహేష్ మంగళవారం తెలిపారు. స్థానిక కురిచేడు రోడ్డులో ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం పక్కన 30 సెంట్ల స్థలం ఇచ్చేందుకు ఉన్నతాధికారుల నుంచి అనుమతి పత్రం వచ్చినట్లు ఆయన తెలిపారు.

## మెరుగైన వసతులు కల్పించాలి

సింగరాయకొండ గ్రామీణం: ప్రభుత్వ వసతి గృహాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కందుకూరు కోర్టు అదనపు జూనియర్ సివిల్ జడ్జి నిఖిల్ రెడ్డి ఆదేశించారు. సింగరాయకొండలోని ప్రభుత్వ వసతి గృహాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. బాలికల వసతి గృహం పరిసరాల్లో వీధి దీపాలు పనిచేయక పోవడం, పరిసరాలు పిచ్చి మొక్కలతో కనిపించడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

## పాఠశాల మూసి వేయొద్దు

సి.ఎస్.పురం: రోల్ తక్కువగా ఉందని బోయమడుగుల పాఠశాలను మూసివేయొద్దని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి నాయబ్‌రసూల్ డిమాండ్ చేశారు. సి.ఎస్.పురం ప్రధాన ప్రాథమిక పాఠశాలలో ఏపీటీఎఫ్ సమావేశం మంగళవారం జరిగింది.

## కురిచేడులో కరపత్రాల కలకలం

అవీ... ఇవీ... అన్నీ...

కురిచేడు: ఎంఈవో-1, 2లుగా విధులు నిర్వర్తిస్తున్న వస్త్రాంనాయక్, సుబ్బారావులపై ఆరోపణలు చేస్తూ కరపత్రాలు దర్శనమిచ్చిన సంఘటన మంగళవారం తెల్లవారుజామున కురిచేడులో చోటుచేసుకుంది. గ్రామంలోని పలు వీధులతోపాటు కూడలి మార్గాల్లో 'కురిచేడు ఎంఈవో కార్యాలయంలో లీలలు' అనే పేరుతో కరపత్రాలు కనిపించాయి. దీనిపై ఎంఈవోలు మాట్లాడుతూ.. తామంటే గిట్టని వ్యక్తులు తమ మీద బురదజల్లే కార్యక్రమం చేపట్టారని, ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు.

## రూ.1.6 కోట్లతో పరివర్తకం ఏర్పాటు

ఈదర(ముండ్లమూరు), న్యూస్‌టుడే: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని ఏడీఈ కె.పిచ్చయ్య తెలిపారు. మండలంలోని ఈదర గ్రామంలో రూ.1.60 కోట్లతో నూతనంగా ఏర్పాటు చేసిన పరివర్తకాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. వ్యవసాయానికి పగటి వేళల్లోనూ విద్యుత్తు సరఫరా చేయనున్నట్లు తెలిపారు. వర్షాలు కురుస్తున్నందున మోటర్ల వద్ద రైతులు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఏడీఈ వినయ్‌కుమార్‌రెడ్డి, ఏఈ అంకబాబు, రైతులు పాల్గొన్నారు.

## వ్యాధులపై అప్రమత్తం

కనిగిరి: కాలానుగుణ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డీఎల్‌డీవో శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికార్లతో సమావేశం నిర్వహించారు. మంచినీటి పథకాలను శుభ్రం చేయించాలన్నారు. ఎంపీడీవో హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు. ❖ **ముండ్లమూరు:** ఎంపీడీవో రావూరి జనార్దన్ మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ❖ **పీసీపల్లి:** వ్యాధులపట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని ఇన్‌ఛార్జి ఎంపీడీవో ప్రభాకరశర్మ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు.

## ఉచిత బస్సు ప్రయాణం కోసం పోస్టుకార్డు ఉద్యమం

కొండపి గ్రామీణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అమలు చేస్తానన్న సూపర్-6 హామీల్లో ఉచిత బస్సు ఎక్కడ? అని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ సైదా ప్రశ్నించారు. మంగళవారం కొండపి ఆర్టీసీ బస్టాండ్‌లో పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుంటుపల్లి శ్రీనివాసరావు, ప్రసన్నరాజు, బొడ్డు సతీష్, కాకుమాను పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

### ❖ కార్మిక హక్కులకు పోరాడుతాం..

దర్శి, న్యూస్‌టుడే: దర్శి నియోజకవర్గానికి చెందిన కైపు వెంకటకృష్ణారెడ్డి రాష్ట్ర కాంగ్రెస్ అసంఘటిత కార్మికులు, ఉద్యోగుల విభాగానికి ఛైర్మన్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ జాతీయ కార్యదర్శి కేసీ.వేణుగోపాల్ ఉత్తర్వులు విడుదల చేసినట్లు కృష్ణారెడ్డి తెలిపారు. కార్మికుల హక్కులు, సంక్షేమానికి శ్రద్ధ చూపుతానని ఆయన తెలిపారు.

## వరిలో సస్య రక్షణ చర్యలు అవసరం

ముండ్లమూరు: వర్షాలు కురుస్తున్నందున వరిలో సస్య రక్షణ చర్యలు చేపట్టాలని ఆత్మ ఒంగోలు డీడీవో సుబ్రహ్మణ్యం సూచించారు. ముండ్లమూరులో వ్యవసాయ శాఖ అధికారులు, దర్శి కేవీకే కోఆర్డినేటర్ రమేష్, వ్యవసాయపరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త వరప్రసాద్‌లతో కలిసి మంగళవారం వరి పొలాలను పరిశీలించారు. శాస్త్రవేత్త రమేష్ మాట్లాడుతూ ప్రస్తుతం ఉల్లికోడు తెగులు ఉందని తెలిపారు. ఈదశలో ఎలాంటి ఎరువు వాడకూడదని వివరించారు. ఏవో ఫరూక్, రైతులు పాల్గొన్నారు.

## గుర్తింపు కార్డులివ్వాలని కౌలు రైతుల వినతి

టంగుటూరు, న్యూస్‌టుడే: కౌలు రైతులకు సకాలంలో గుర్తింపు కార్డులు, పంట రుణాలు అందించాలని కౌలు రైతు సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. మండలంలోని కొణిజేడు గ్రామ సచివాలయ వీఏఏ సౌమ్యకు మంగళవారం వినతి పత్రం అందించారు. సంఘ జిల్లా కార్యదర్శి వి.బాలకోటయ్య, మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

## అధికారుల పొలం బాట


కంది పంటను పరిశీలిస్తున్న ఏడీఏ వెంకటరమణ

న్యూస్‌టుడే బృందం: పంటల సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని కనిగిరి ఏడీఏ ఎగ్గోని వెంకటరమణ అన్నారు. సీఎస్‌పురం మండలంలోని వెంగనగుంట, ఆర్‌కేపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పలు సూచనలు చేశారు. సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచాలన్నారు. కనిగిరి, తాళ్లూరు, టంగుటూరు, మర్రిపూడి తదితర మండలాల్లోనూ వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక అధికారులు పర్యటించి రైతులకు పలుసూచనలు చేశారు.

# ఉద్యాన వనం.. నిర్వహణ లేక అధ్వానం

❖ పామూరులో పిచ్చి మొక్కలతో నిండిన పార్కు


కళావిహీనంగా మారిన పామూరులోని డీవీ పార్కు

న్యూస్‌టుడే, పామూరు

ప్రస్తుత దైనందిన ఒత్తిడిమయ జీవితంలో మనిషికి కాస్త ఆహ్లాదం అవసరం. ఖాళీ సమయాలు, వారాంతాల్లో కుటుంబంతో కలిసి సరదాగా గడపాలి అనుకుంటారు. దూరప్రాంతాలకు వెళ్లలేకపోయినా దగ్గరలో పార్కులు, ఇతర ప్రదేశాల్లో సేదతీరుతారు. మేజర్ పంచాయతీ, వ్యాపార కేంద్రమైన పామూరులో అలాంటి ప్రశాంతమైన ప్రాంతం కనిపించడం లేదు. నివాసాలకు దగ్గరలో ఉండే పార్కుకి వెళదామంటే దాని నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో నిరుత్సాహంగా ఇంటికే పరిమితమవుతున్నారు. పామూరులో సుమారు 32,000 మందికి పైగా జనాభా, 12,000 కుటుంబాలు ఉన్నాయి. పదుల సంఖ్యలో కళాశాలలు, పాఠశాలలు ఉన్నాయి. వ్యాపార రంగంలో అభివృద్ధి చెందుతోంది. నిత్యం వివిధ పనులపై పామూరు, పీసీపల్లి, సి.ఎస్.పురం, నెల్లూరు జిల్లా వరికుంటపాడు, దుత్తలూరు, ఉదయగిరి మండలాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో వస్తుంటారు. పామూరులోని కందుకూరు రహదారిలోని కొత్త చెరువు పక్కన ప్రభుత్వ స్థలంలో 2000 సంవత్సరంలో సూర్యచంద్ర సేవా సంస్థ పేరుతో ఆ సంస్థ అధ్యక్షుడు డీవీ మనోహర్ పార్కును ఏర్పాటుచేశారు. కొన్నేళ్లపాటు ప్రజలు, మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు అక్కడికి వెళ్లి సేదతీరారు. గత కొన్నేళ్లుగా అధికారులు పార్కు నిర్వహణను పట్టించుకోకపోవడంతో అధ్వానంగా తయారైంది. ఈ ఉద్యానవనంలో ప్రస్తుతం కనీస సదుపాయాలు లేవు. యువత, ప్రజలకు వ్యాయామం చేసుకునేందుకు ఎక్కడా అవకాశం లేకుండా పోయింది. సెలవు రోజుల్లో పిల్లలు ఆడుకోవడానికి అనువైన ప్రదేశం లేదు. గతంలో పార్కులో ఏర్పాటు చేసిన ఊయలలు, జారుడు పరికరాలు, ఇతర వస్తువులు సైతం కానరాకుండా పోయాయి. పచ్చదనం కనుమరుగై, పిచ్చిమొక్కలు ఆవరించాయి. చెరువుకట్టపై మహిళలు, ప్రజలు నడిచేవారు. ప్రస్తుతం కూర్చునేందుకు కూడా బల్లలు లేవు. పార్కు ప్రాంగణంలో, చెరువుకట్టపై వాకింగ్ ట్రాక్‌పై కంపచెట్లు పెరిగాయి. ప్రజలు కూర్చోవడానికి, సేద దీరడానికి ఎలాంటి సౌకర్యం లేదు. పార్కు కళావిహీనంగా తయారైంది. పార్కు మందుబాబులకు నిలయంగా మారింది. బహిర్భూమికి నిలయంగా మారింది. పార్కు నిర్వహణ, పరికరాలను ఏర్పాటుచేసే దిశగా పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టలేదు. ఉన్న పార్కును అభివృద్ధి చేయాలని లేదా నూతన పార్కునైనా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.


పార్కులో ధ్వంసమైన బల్లలు

## రీసర్వే తప్పుల సవరణకు గ్రామసభలు



నందిపాడు సభలో మాట్లాడుతున్న ఆర్డీవో లక్ష్మీప్రసన్న

న్యూస్‌టుడే బృందం: భూముల రీసర్వేలో దొర్లిన తప్పుల సవరణకు మంగళవారం గ్రామసభలు నిర్వహించారు. మద్దిపాడు నందిపాడులో ఆర్డీవో లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ సమస్యలపై అర్జీలు అందజేస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. తహసీల్దార్ సుజన్ కుమార్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు. సంతనూతలపాడు మండలం పి.గుడిపాడులో తహసీల్దార్ వి.ఆదిలక్ష్మి, చీమకుర్తి మండలం మంచికలపాడులో తహసీల్దార్ బ్రహ్మయ్య ఆధ్వర్యంలో సదస్సులు నిర్వహించారు. గ్రామ సభల్లో వచ్చిన అర్జీలను 45 రోజుల్లో పరిష్కరించనున్నట్లు తెలిపారు. రీసర్వే నిర్వహించిన అన్ని గ్రామాల్లో సదస్సులు జరుగుతాయని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## ముగిసిన ఏకేయూ అంతర కళాశాలల పోటీలు



ముగింపు వేడుకలో మాట్లాడుతున్న రిజిస్ట్రార్ హరిబాబు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: ఆటల పోటీల్లో ఏకేయూ ప్రతిభను జాతీయస్థాయిలో ఇనుమడింపజేయాలని విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ బి.హరిబాబు కోరారు. అంతర కళాశాలల స్థాయి పోటీలు ముగింపు సందర్భంగా మంగళవారం వేటపాలెంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విజేతలు ఈ నెల 26న చెన్నైలోని ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు ద్వారా 28 రకాల క్రీడలకు అనుమతి ఇచ్చిందని, వాటిలో విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. జాతీయ స్థాయిలో ప్రతిభ చూపినవారికి తన వ్యక్తిగతంగా రూ.20 వేలు ప్రోత్సాహకం అందజేస్తామన్నారు. ఆటల పోటీల్లో బిజీగా ఉండటం వల్ల చదువులో వెనుకబడిన వారికి పబ్లిక్ పరీక్షల్లో 25 శాతం వరకు బోనస్ మార్కులిస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం అధికారి దేవీ వరప్రసాద్ పాల్గొన్నారు.

## కాలానుగుణ వ్యాధులపై అప్రమత్తం



నాగులుప్పలపాడు: సూచనలు చేస్తున్న ఎంపీడీవో మహాలక్ష్మి

న్యూస్‌టుడే బృందం: కాలానుగుణ వ్యాధులు ప్రబలకుండా అంతా అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ఈ మేరకు చీమకుర్తి, సంతనూతలపాడు, మద్దిపాడు, నాగులుప్పలపాడు, కొత్తపట్నం మండల పరిషత్ కార్యాలయాల్లో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ సహాయకులు, ఏఎన్‌ఎంలతో మంగళవారం ప్రత్యేక సదస్సులు నిర్వహించారు. పల్లెల్లో పారిశుద్ధ్యం మెరుగు, ట్యాంకుల శుభ్రత, క్లోరినేషన్ తదితర అంశాలపై మండల అధికారులు, వైద్యులు పలు సూచనలు చేశారు. ఎక్కడైనా సమస్య తలెత్తితే వెంటనే సమాచారం అందజేయాలని పేర్కొన్నారు. ఆయా మండలాల ఎంపీడీవోలు సురేష్‌బాబు, జ్యోతి, మహాలక్ష్మి, వైద్యాధికారులు వైష్ణవ, సుమన్‌కుమార్, ఒనారియల్, కలలీన్, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

## 25 నుంచి పశుగణన సర్వే

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఈ నెల 25 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి నెలాఖరు వరకు 21వ అఖిల భారత పశుగణన సర్వే చేపట్టనున్నట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. సంబంధిత గోడపత్రాలను ప్రకాశం భవన్‌లో మంగళవారం ఆవిష్కరించారు. సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి పశువుల వివరాలు సేకరిస్తారని... ప్రజలంతా సహకరించాలని కోరారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారిణి డాక్టర్ బేబీరాణి పాల్గొన్నారు.

# ఒంగోలు

•ఒంగోలు •సంతనూతలపాడు

## రాయితీ శనగ విత్తనాలకు పేర్ల నమోదు

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో రాయితీ శనగ విత్తనాల పంపిణీకి వివరాలు నమోదు చేస్తున్నట్లు ఏవో పి.పావని తెలిపారు. రుద్రవరంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడారు. రబీకి సంబంధించి పంట నమోదు చేయించుకోవాలని రైతులకు సూచించారు. ఏఈవో సుబ్బారెడ్డి, రైతులు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

## పంటల్లో సస్యరక్షణ తప్పనిసరి

చీమకుర్తి, న్యూస్‌టుడే: వర్షాల నేపథ్యంలో కంది, వరి పంటలకు తెగుళ్లు ఆశించకుండా తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని చీమకుర్తి మండల వ్యవసాయాధికారి డి.భాస్కర్ సూచించారు. బండ్లమూడిలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా వరి, కంది పంటలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఏఈవో వెంకటేశ్వర్లు, వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

# పట్టాలెక్కని బృహత్తర ప్రణాళిక

- గత పాలకుల నిర్లక్ష్యంతో ప్రాథమిక దశ దాటని దుస్థితి
- అమల్లోకి తెస్తే నగర వాసులకు ఎంతో మేలు



మస్తాన్ దర్గా నుంచి ట్రంక్‌రోడ్డు పరిస్థితి

న్యూస్‌టుడే – ఒంగోలు నగరం

పట్టణం, నగరం ఏదైనా పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా... భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా వసతులు కల్పించాలి. ఈ విషయంలో మాస్టర్ ప్లాన్ (బృహత్తర ప్రణాళిక) అత్యంత కీలకమైనది. రహదారులు, కాలువల విస్తరణ... కొత్తగా నిర్మాణం; ఖాళీ స్థలాల సద్వినియోగం వంటివన్నీ దీనితోనే ముడిపడి ఉంటాయి. ఇంతటి ప్రాధాన్య అంశాన్ని గత వైకాపా పాలకులు విస్మరించారు. ప్రణాళిక పేరిట రెండున్నరేళ్ల క్రితం హడావుడి చేసినా నేటికీ అది తుది రూపుదాల్చలేదు. తగిన కార్యాచరణతో ఇప్పటికే అమలు చేసి ఉంటే.. ప్రస్తుత వర్షాలకు వరద, మురుగన్న సమస్యలు, ట్రాఫిక్ చిక్కులు తలెత్తేవి కావు.

### ఉత్తుత్తి హడావుడే...

గత వైకాపా ప్రభుత్వ హయాంలో జీఐఎస్ (జియో ఇన్ఫర్మేషన్ సిస్టం) ఆధారిత బృహత్తర ప్రణాళిక తయారు చేయాలని నిర్ణయించారు. ప్రణాళిక డ్రాఫ్ట్ తయారీ బాధ్యతను పుణెకి చెందిన ఓ సంస్థకు అప్పగించారు. ఇందుకోసం సుమారు రూ.4 కోట్లు చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. 2021లో రంగంలోకి దిగిన సదరు సంస్థ డ్రోన్‌ల సాయంతో సర్వే చేపట్టి... 2022లో ప్రణాళిక సమర్పించింది. టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ అధికారులు, కలెక్టర్ పరిశీలించాక ఒడా (ఒంగోలు అర్బన డెవలప్‌మెంట్ అథారిటీ) ద్వారా డ్రాఫ్ట్ పబ్లికేషన్ ఇచ్చారు. ప్రజలు, ప్రజా ప్రతినిధుల అభిప్రాయాలు సేకరించారు. సుమారు యాభై అభ్యంతరాలు, సవరణలు వచ్చాయి. వాటిని సరి చేసి మళ్లీ ప్రణాళిక తయారు చేయాల్సి ఉండగా... బిల్లులు చెల్లించకపోవడంతో సదరు సంస్థ తరువాత ప్రక్రియ చేపట్టలేదు. దీంతో 2023 మార్చిలోనే అమల్లోకి రావాల్సిన బృహత్తర ప్రణాళిక... ఇంకా ప్రాథమిక దశనే దాటలేదు.

2016లో తొలిసారి బృహత్తర ప్రణాళిక రూపొందించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం... మున్సిపల్ పట్టణ పరిధి వరకు దానిని తయారు చేశారు. 2017లో ఆమోదించి... 2037 వరకు కొనసాగేలా గెజిట్ ప్రకటన ఇచ్చారు. ప్రస్తుతం ఇదే అమల్లో ఉంది.



ఓపీఎస్ వద్ద మంగమూరు రోడ్డు

*మున్సిపాలిటీగా ఉన్న ఒంగోలును 2012 జనవరిలో నగరపాలక సంస్థగా మార్చారు. ఇందుకోసం పరిసరాల్లోని ఎనిమిది పంచాయతీలు, రెండు శివారు గ్రామాలను విలీనం చేశారు. దీంతో 2.10 లక్షలుగా ఉన్న జనాభా 3.10 లక్షలకు చేరింది.*

### గతంలో చేసిన ప్రతిపాదనలు...

- ట్రంక్‌రోడ్డును మిరియాలపాలెం కూడలి నుంచి పాత మార్కెట్ వరకు వంద అడుగులకు విస్తరించాలి. ప్రస్తుతం ఇది 46 అడుగులు మాత్రమే ఉంది.
- వంద అడుగులుగా ఉన్న గుంటూరు రోడ్డు, పాత బైపాస్‌లను 150 అడుగులకు విస్తరించాలి.
- చీమకుర్తి నుంచి వచ్చే భారీ గ్రానైట్ వాహనాలు నగరంలోకి రాకుండా ఏడుగుండ్లపాడు పక్క నుంచి పేర్నమిట్ట, సంతనూతలపాడు మధ్య రింగ్ రోడ్డు... జాతీయ రహదారిని అనుసంధానిస్తూ యరజర్ల, పెళ్లూరు వైపు మరో రోడ్డు నిర్మించాలి.
- ఈ రహదారులకు ఇరువైపులా మురుగు కాలువల నిర్మాణం చేపట్టాలి.
- నగరంలోని ప్రభుత్వ స్థలాలను ప్రజావసరాలకు వినియోగించేలా పలు సూచనలు చేశారు.

నగరం భావి అవసరాల దృష్ట్యా అప్పట్లో ఈ ప్రతిపాదనలు చేశారు. వీటిని మరో సారి పునఃపరిశీలించి... అవసరమైన మార్పులు, చేర్పులతో తుది రూపు ఇచ్చి అమల్లోకి తేవాల్సిన అవసరం ఉంది.



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న యూనివర్సిటీ ప్రతినిధులు

## ప్రతిభకు కేఎల్ వర్సిటీ ప్రోత్సాహం

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: ప్రతిభ కలిగిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ జాతీయ స్థాయిలో పోటీ పరీక్ష నిర్వహిస్తోందని వర్సిటీ ప్రవేశాల విభాగం డైరెక్టర్ జె.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో పరీక్షలకు సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. డిసెంబర్ ఆరు నుంచి 13 వరకు దశలవారీగా పరీక్షలు ఉంటాయని... విద్యార్థులంతా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో డీన్ రామకృష్ణ, ప్రిన్సిపల్ వెంకయ్య, రామాంజనేయులు పాల్గొన్నారు.

## చిత్ర ఫెస్ట్-2024 గోడపత్రాల ఆవిష్కరణ

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: చిత్ర ఫెస్ట్-2024 గోడపత్రాలను మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి మంగళవారం ఆవిష్కరించారు. సృష్టి ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల విజేతలకు... నవంబర్ 2న ఒంగోలు అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించే వేడుకలో బహుమతులు అందించనున్నట్లు సంస్థ ప్రతినిధి తిమ్మిరి రవీంద్ర తెలిపారు. 3న ప్రాచీన భారత్ అంశంపై వివిధ రాష్ట్రాల చిత్రకారులు గీసిన కళాఖండాల ప్రదర్శన ఉంటుందన్నారు. అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

## గ్రానైట్ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలి

చీమకుర్తి, న్యూస్‌టుడే: చీమకుర్తి ప్రాంతం నుంచి గ్రానైట్ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసి... బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి పూసపాటి వెంకట్రావు కోరారు. చిన్న పరిశ్రమలను ఆదుకోవాలని, కార్మికుల ఉపాధి కాపాడాలని పేర్కొన్నారు.

## అధ్యాపకులకు ధ్రువపత్రాలు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: ముంబయి ఐఐటీ స్పోకెన్ ట్యుటోరియల్ వారు లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టంపై నిర్వహించిన ఆన్‌లైన్ పరీక్షలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన 26 మంది అధ్యాపకులు ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపల్ డి.కల్యాణి తెలిపారు. మంగళవారం వీరందరికీ సదరు ధ్రువపత్రాలు అందజేశారు. ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా ఈ నెల 19న ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించారన్నారు. అధ్యాపకులంతా ఈ విధానాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. జేకేసీ మెంటార్ సురేష్‌కుమార్, సమన్వయకర్త రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

## రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

సంతనూతలపాడు, నాగులుప్పలపాడు: అందరూ సత్ప్రవర్తన కలిగి ఉండాలని పోలీసు అధికారులు సూచించారు. సంతనూతలపాడు, నాగులుప్పలపాడు స్టేషన్ల పరిధిలో రౌడీ షీటర్లకు మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. సంఘ విద్రోహ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్సైలు వి.అజయ్ బాబు, బి.శ్రీకాంత్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు

## చర్చి ఎదుట మద్యం దుకాణం వద్దని నిరసన

మద్దిపాడు, న్యూస్‌టుడే: గుండ్లాపల్లి గ్రోత్‌సెంటర్‌లో చర్చి ఎదుట మద్యం దుకాణం ఏర్పాటు తగదంటూ మంగళవారం... చర్చి ప్రతినిధులు పారిశ్రామిక వాడ నుంచి నాగులుప్పలపాడు వెళ్లే మార్గంలో వాహనాలు ఆపి నిరసన తెలిపారు. దీనివల్ల పలు ఇబ్బందులు తలెత్తుతాయని పేర్కొన్నారు. పాస్టర్ తాటిపర్తి యాకోబు, చర్చి పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.



పోటీలో పాల్గొన్న విద్యార్థులు



విజేతలతో కరస్పాండెంట్ సీబీ మైఖేల్, ఉపాధ్యాయులు

## వ్యాసం రాశారు... ప్రశంసలు అందుకున్నారు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: 'ఇంటర్నెట్ వినియోగం... లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అన్న అంశంపై... 'ఈనాడు' ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన వ్యాసరచన పోటీలు సందడిగా సాగాయి. కేరళ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో... 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వారి అభిప్రాయాలను సూటిగా తెలియజేస్తూ వ్యాసాలు రాశారు. విద్యార్థినులు వై.విమలాజానకి (9వ తరగతి), పి.రుషిత (పదో తరగతి), పి.జ్యోతిర్మయి (9వ తరగతి) ప్రతిభ చాటి వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి పాఠశాల కరస్పాండెంట్ సీబీ మైఖేల్... బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. సిబ్బంది కల్పవల్లి, పి.చంద్ర, అనిల్‌కుమార్, మాధవి, షైమా, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

## అయోడిన్ లోపిస్తే అనర్థమే



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వైద్యాధికారులు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: అయోడిన్ లోపిస్తే పిల్లల్లో ఎదుగుదల ఉండదని, బుద్ధిమాంద్యం, థైరాయిడ్ లాంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని రాష్ట్రీయ బాల స్వస్థ జిల్లా అధికారి డాక్టర్ భాగీరథి పేర్కొన్నారు. అయోడిన్ వ్యాధుల నివారణ దినోత్సవం సందర్భంగా రామనగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. గర్భిణుల్లో ఈ లోపం ఉంటే పుట్టే బిడ్డల్లో వినికిడిలోపం సమస్యలు తలెత్తుతాయన్నారు. అయోడిన్ కలిగిన ఉప్పునే అందరూ వినియోగించాలని సూచించారు. ఆ ఉప్పును కూడా గాలి, వేడి తగలని డబ్బాల్లో భద్రపరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అనిల్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ఆధార్ నవీకరణ ప్రక్రియ పరిశీలన

మద్దిపాడు, న్యూస్‌టుడే: మద్దిపాడు సచివాలయంలో మంగళవారం నిర్వహించిన ఆధార్ నవీకరణ ప్రక్రియను ఎంపీడీవో జ్యోతి పరిశీలించారు. ఎక్కువ మంది రావడంతో ఇబ్బందులు తలెత్తకుండా టెంట్ ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. తెదేపా మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు, యూనిట్ ఇన్‌ఛార్జి నవూలూరి శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రేపు పీడీఎస్‌యూ అర్ధ శతాబ్ది ఉత్సవాలు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఈ నెల 24న నిర్వహించనున్న పీడీఎస్‌యూ అర్ధ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రాజశేఖర్ విజ్ఞప్తి చేశారు. సంబంధిత గోడపత్రాలను ఒంగోలులోని మాదాల నారాయణస్వామి భవనంలో మంగళవారం ఆవిష్కరించారు. భవిష్యత్తు కార్యాచరణ రూపకల్పనకు నవంబర్ 5న విజయవాడలోని ఎంబీవీకే భవనంలో ప్రత్యేకంగా సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు సీహెచ్.శ్యామ్, కార్యదర్శి వెంకటేష్, కోశాధికారి కోటయ్య తదితరులు పాల్గొన్నారు.



గోడపత్రాలను ఆవిష్కరిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ ఏడుకొండలరావు

## ఈఎన్‌టీ పీజీ విద్యార్థుల ప్రతిభ

ఒంగోలు నగరం: మూడు రోజుల పాటు హైదరాబాద్‌లో నిర్వహించిన సౌత్‌జోన్ వైద్య కళాశాలల సదస్సులో ఒంగోలు ఈఎన్‌టీ పీజీ మొదటి సంవత్సరం విద్యార్థులు ప్రతిభ చాటారు. డాక్టర్ లింగమనేని పతకాన్ని సంయుక్త వందన సాధించగా... బెస్ట్ ఈ పోస్టర్ విభాగంలో దేవరపల్లి రమ్యశ్రీ సత్తా చాటారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాటు వారిని ప్రోత్సహించిన ఈఎన్‌టీ విభాగాధిపతి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభాకరరావును ప్రిన్సిపల్ డాక్టర్ ఏడుకొండలరావు అభినందించారు.

## పొంగిన కొత్తకోట వాగు

నాగులుప్పలపాడు: కొరిశపాడు మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం కురిసిన వర్షాలకు నాగులుప్పలపాడు మండలంలోని కొత్తకోట వాగు పొంగింది. దీంతో గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్ - నాగులుప్పలపాడు రహదారిలో రాకపోకలు నిలిచిపోయి వాహనదారులు ఇబ్బంది పడ్డారు.





## మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) ఒంగోలు నగరం: 8008574067 ఒంగోలు గ్రామీణం : 8008564455

ఒంగోలు అంజయ్య రోడ్డు : 8247324766
ఎస్.ఎన్.పాడు: 8008552692

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే:

?: పెళ్లూరు - వాసేపల్లిపాడు రహదారి గుంతలు పడి అధ్వానంగా తయారైంది. ఈ మార్గంలో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. కాలువలు సైతం సరిగా లేవు.
– సుధ, ప్రభుత్వ ఉద్యోగి, పెళ్లూరు

✓: పరిశీలించి... రహదారి మరమ్మతులు చేపడతాం. పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా కాలువల బాగుకు చర్యలు తీసుకుంటాం. – కె.వెంకటేశ్వరరావు, కమిషనర్

?: సర్వేరెడ్డిపాలెంలోని కాలువల్లో వ్యర్థాలు పూడిపోయి... దుర్వాసనతో పాటు, దోమల బెడద పెరిగింది.
– పి.సుబ్బారావు, గ్రామస్థుడు

✓: వెంటనే పూడికతీత పనులు చేయిస్తాం.
– బాలచెన్నయ్య, ఈవోఆర్డీ

## వ్యర్థాలు తరలించారు

స్పందనకు వందనం

ఒంగోలు అంజయ్య రోడ్డు, న్యూస్‌టుడే: దేవుడుచెరువు ప్రాంతంలో కాలువల్లో తొలగించిన వ్యర్థాలను ఆ పక్కనే కుప్పలుగా పోశారు. తరువాత తరలించకపోవడంతో సమస్య నెలకొంది. ఈ విషయమై 'పూడిక తీశారు... వదిలేశారు' శీర్షికన 'ఈనాడు'లో సోమవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మంగళవారం ఆ ప్రాంతంలోని వ్యర్థాలు తొలగించారు.

## పేరులోనే భాగ్యం... అంతా సమస్యల నిలయం



నాలుగో లైన్‌లో రహదారి దుస్థితి



పార్కును ఆనుకుని... పూడిపోయిన కాలువ

నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో ఒకటిగా చెప్పుకొనే భాగ్యనగర్‌లో ఎటు చూసినా సమస్యలే దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా నాలుగో లైన్ రహదారి మొత్తం గుంతలు పడి... అటుగా రాకపోకలకు వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. వర్షాల సమయంలో నీరు నిలిచి మరిన్ని చిక్కులు తప్పడం లేదని స్థానికులు వాపోతున్నారు. గత ప్రభుత్వ హయాంలో పైపులైన్ కోసం పలుచోట్ల గుంతలు తవ్వి... తిరిగి పూడ్చకపోవడంతో మరికొన్ని చోట్ల సమస్యలు తప్పడం లేదు. భాగ్యనగర్ నుంచి విజయనగర్ కాలనీకి వెళ్లే రహదారిలో ఎక్కడికక్కడ వేగనిరోధకాలు ఏర్పాటు చేశారు. నిత్యం ఇటుగా వెళ్లేవారు, ద్విచక్ర వాహనాలపై వెళ్లే వృద్ధులు... వాటిని దాటే క్రమంలో ఇబ్బందులు పడుతున్నారు. కొన్నింటిని తొలగించాలని కోరుతున్నారు. పార్కు పక్కన ఉన్న కాలువను బాగు చేయకపోవడంతో... ఉద్యానంలోనే నీరు నిలిచి సమస్య నెలకొంటోంది. పరిష్కారం దిశగా కార్పొరేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఒంగోలు అంజయ్యరోడ్డు

## గెలాక్సీ పురి... వెలుగులేవీ!



బస్టాండ్ కూడలిలో వెలగని ఓ దీపం

చీమకుర్తి పట్టణంలో వీధి దీపాలు సరిగా వెలగడం లేదు. దీంతో చీకటి పడ్డాక రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రధాన రహదారిలో బస్టాండ్ కూడలి, కెనరా బ్యాంక్, గాంధీనగర్ మొదటి వీధి, ఎన్నెస్పీ కాలనీ తదితర ప్రాంతాల్లో గత కొద్ది రోజులుగా దీపాలు వెలగడం లేదు. కొన్ని చోట్ల వరుసగా మూడు నాలుగు వెలగక పోవడతో ఆయా ప్రాంతాల్లో అంధకారం నెలకొంటోంది. వర్షాలకు రహదారి అంచుల్లో నీరు చేరడం, మరోవైపు కుక్కలు స్వైర విహారం చేస్తుండడంతో రాత్రివేళ ఆయా మార్గాల్లో వెళ్లేందుకు పాదచారులు భయపడుతున్నారు. అంతర్గత మార్గాల్లో వెలగని దీపాల మరమ్మతులకు మున్సిపాలిటీ వారు ఇటీవల చర్యలు తీసుకున్నారు. ఇందుకోసం కొన్ని పరికరాలూ తెచ్చారు. ప్రధాన రహదారిలో అధిక సామర్థ్యం కలిగిన దీపాలకు ఇవి చాలకపోవడంతో సమస్య నెలకొంది. ఈ విషయమై కమిషనర్ రామకృష్ణ మాట్లాడుతూ త్వరలో పెద్ద దీపాలనూ బాగు చేయిస్తామని తెలిపారు.
– న్యూస్‌టుడే, చీమకుర్తి